PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 188 | విజయవాడ, గురువారం 9 ఫిబ్రవరి 2023 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 9 February 2023 | Rs

రబీ సాగు అస్తుబిస్తు

- ఫిబ్రవరి వచ్చినా సాగని సేద్యం
- పది లక్షల ఎకరాల్లో తగ్గుదల
- ఇంకా నెలే సమయం

● లోపలి పేజీలో.. ●

సచివాలయాల ఉద్యోగులకు సెలవులు క్రెడిట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ప్రొబేషన్ డిక్లేర్ అయిన వారి సర్వీస్ రిజిస్టర్లలో అన్ని రకాల సెలవులను క్రెడిట్ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, హెచ్‌ఓడి, గిరిజన సహకార సంస్థ డిప్యూటీ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్లను గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ షణ్మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వుల్లో 'సర్వీస్ రెగ్యులరైజేషన్' అనే పదం లేదనే కారణంతో కొందరు కంట్రోలింగ్ అధికారులు ఉద్యోగుల లీవ్‌లను మంజూరు చేయడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్ ఆటోమెటిక్‌గా సర్వీసు రెగ్యులరైజేషన్‌ను కలిగిస్తుందని, నిబంధనల ప్రకారం సెలవులు మంజూరు చేయాలని తెలిపారు.



ఆమదాలవలసలోని ఓ మిల్లులో రైతుల నుంచి సేకరించిన ధాన్యం

ధాన్యం డబ్బులు ఏవీ?

- నెల రోజులు దాటినా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- రాష్ట్ర వ్యాప్తంగా రూ.1724 కోట్లు పెండింగ్
- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

- ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన రైతు అన్నెపు భాస్కరరావు గతేడాది డిసెంబరు 28న కొర్లకోట ఆర్‌బికెకు 40 బస్తాలు (ఒక్కో బస్తా 80 కేజీలు) ఇచ్చారు. ఆయనకు ప్రభుత్వం నుంచి ధాన్యం, రవాణా, గన్నీ బ్యాగులకు కలిపి మొత్తం రూ.80 వేలు రావాల్సి ఉంది. నెల రోజులు దాటినా ఇప్పటికీ ఖాతాలో డబ్బులు జమ కాలేదు. ఖరీఫ్ సాగు ఖర్చుల కోసం ఆయన నూటికి నెలకు రూ.2 చొప్పున వడ్డీ వ్యాపారుల నుంచి రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ధాన్యం డబ్బులు వస్తే కొంత అప్పు తీర్చి రబీ సాగుకు ఖర్చు చేద్దామనుకున్నారు. డబ్బులు సకాలంలో రాకపోవడంతో, రబీలో నాలుగు ఎకరాల్లో మినప, పెసర పంట సాగు ఖర్చుల కోసం మరో రూ.50 వేలు అప్పు చేశారు.
- శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం పంచాయతీకి చెందిన రైతు ఇప్పిలి రమణమ్మ డిసెంబరు 27న రామచంద్రాపురం ఆర్‌బికెకు 120 బస్తాల ధాన్యం ఇచ్చారు. ఆమెకు ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు రావాల్సి ఉంది. ఖరీఫ్ సాగు ఖర్చుల కోసం వడ్డీ వ్యాపారుల వద్ద నూటికి రూ.రెండు చొప్పున రూ.రెండు లక్షలు అప్పు చేశారు. ధాన్యం డబ్బులు వస్తే రెండో పంట సాగు ఖర్చులకు ఉపయోగపడుతుందని ఆమె ఆశించినా డబ్బులు అందలేదు. దీంతో, రబీలో ఎనిమిది ఎకరాల్లో మినప, పెసర సాగుకు రూ.మరో లక్ష వరకు అప్పు చేశారు.

ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఖరీఫ్‌లో అప్పు చేసి వరి సాగు చేసిన అన్నదాతలు ధాన్యం డబ్బులు సకాలంలో రాకపోవడంతో రబీలోనూ మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వడ్డీల భారం తడిసిమోపెడవుతోంది. ధాన్యం ఇచ్చిన రైతులకు 48 గంటల నుంచి 21 రోజుల వ్యవధిలో చెల్లింపులు చేపడతామని చెప్పిన ప్రభుత్వం నెల రోజులు దాటినా రైతుల ఖాతాలో డబ్బులు జమ మిగతా 2లో

అదానికి 406 ఎకరాలు

• అనంతపురం జిల్లాలో కేటాయింపు • క్యాబినెట్ నిర్ణయం

- వివాదాలు పట్టించుకోని రాష్ట్ర సర్కారు
- కర్నూలులో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం
- 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమం టైం స్కేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదాని అక్రమాలపై దేశ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనను రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసింది. పార్లమెంటులో చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న సమయంలోనే అనంతపురం జిల్లాలో మరో 406.40 ఎకరాల భూమిని అదాని సంస్థలకు అప్పగించడానికి రంగం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అదానిగ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు 500మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు 406.40 ఎకరాల భూమిని ఎకరం రూ.5లక్షల వంతున ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. అనంతపురం జిల్లా తాడిమర్రిమండలం పెద్దకోట్ల దాడితోట గ్రామాల పరిధిలో ఈ భూములు కేటాయించనున్నారు. దీంతో పాటు

కర్నూలులో 50 ఎకరాల విస్తీర్ణంలో న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు 4,534మందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేస్తూ ఎస్‌జిటి పోస్టులను భర్తీ చేయాలని క్యాబినెట్ ఆమోదించింది. ఉగాదికి అందించే సంక్షేమ పథకాలకు కూడా మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సమావేశంలో 70 అంశాలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు. వైఎస్‌ఆర్ లా నేస్తం, వైఎస్‌ఆర్ ఆసరా, ఇబిసి నేస్తం, వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్లు ఆయన చెప్పారు. .ఈనెల10న కళ్యాణమస్తు, షాదీతోఫాలను ప్రారంభిస్తామని, కళ్యాణమస్తుకు దరఖాస్తు చేసుకునే వార పదవతరగతి పాసై ఉండాలని తెలిపారు. ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు కూడా ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. 28న జగనన్న విద్యా దీవెన పూర్తి స్థాయి రీ ఎంబర్స్‌మెంట్ రూ.700కోట్లు విద్యార్థులకు అందచేస్తామన్నారు. ఉగాది సందర్భంగా మహిళా సంఘాలకు 79లక్షల మంది మహిళలకు మూడో విడత సుమారు 6,500కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉగాది వేడుకలు వారం రోజుల పాటు చేసుకునేందుకు వీలుగా ఆసరా మూడో విడత పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 3,255 ప్రొసీజర్స్‌ను ఎక్కడ వైద్యం చేయించినా పథకం వర్తించేలా మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. విలేజ్ హెల్త్ నెస్ సెంటర్ రెఫరెల్ సెంటర్‌గా పనిచేస్తుందన్నారు.. కస్తూరిబాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గౌరవ వేతనానికి 23శాతం అదనంగా జీతాలు పెంచుతూ తీర్మానం చేసినట్లు తెలిపారు. విశాఖలో 100 మెగా వాట్ల డేటా సెంటర్ ,రిక్రియేషన్‌కు 60.29ఎకరాల భూమిని కేటాయించేందుకు మంత్రిమండలి మిగతా 5లో



క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి, పాల్గొన్న మంత్రులు

విభేదాలు విడనాడాల్సిందే

- మంత్రులపై సిఎం అసహనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఏమైనా విభేదాలుంటే కూర్చొని పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో పార్టీకి నష్టం జరుగుతుందని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొంత కటువుగానే మాట్లాడినట్లు సమాచారం. సచివాలయంలో బుధవారం క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం అధికారులు బయటకు వెళ్లిన తర్వాత సుమారు 40 నిమిషాల పాటు మంత్రులతో సిఎం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యపోరు జరుగుతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, మీడియాకు ఎక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఒకరిద్దరు మంత్రులకు సిఎం క్లాస్ పీకినట్లు తెలిసింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అంటూ కేంద్ర హోంమంత్రిత్వశాఖకు లేఖ రాసిన విషయంపై కూడా కొద్దిసేపు చర్చ జరిగినట్లు తెలిసింది. గడప గడప కార్యక్రమంలో కొందరు మంత్రులు సక్రమంగా పాల్గొనడం లేదని, సర్వేల్లో ఈ విషయం తేటతెల్లమవుతోందని, గడప గడప కార్యక్రమంపై ఎందుకు సీరియస్‌గా తీసుకోలేక పోతున్నారని ఒకరిద్దరు మంత్రులను గట్టిగా మందలించినట్లు సమాచారం. జిల్లాల్లో నేతలు ఎవరైనా అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసిన వెంటనే ఆ జిల్లా మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రులు వారి వద్దకు వెళ్లి సమస్యకు పరిష్కారాన్ని చూపాలని సిఎం ఆదేశించినట్లు తెలిసింది. జిల్లాల్లో పార్టీపై విపక్షాలు చేస్తున్న విమర్శలను అదే స్థాయిలో తిప్పికొట్టాలని, ప్రభుత్వ పరంగా ఏమైనా ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి వెంటనే తీసుకు రావాలని మంత్రులకు సూచించారు. కేబినెట్‌లో ప్రస్తుతం సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని, పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వారి శాఖలపై పట్టు సాధించారని, మిగిలిన మంత్రులు కూడా శాఖలపై పట్టు సాధించాలని సిఎం సూచించినట్లు సమాచారం.

దాటవేత...దాడి

- లోక్‌సభలో ప్రధాని మోడీ
- ప్రతిపక్షాల నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ వ్యాప్తంగా కలకలం రేపిన అదాని వ్యవహారంపై ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు జవాబుఇవ్వడానికి బదులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ లోక్‌సభలో దాటవేత వైఖరిని అవలంభించారు. అదే సమయంలో ప్రతిపక్షాలపై ఎదురుదాడికి దిగారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని బుధవారం సమాధానం ఇచ్చారు. సుదీర్ఘంగా సాగిన ఆయన సమాధానంలో అదాని పేరునుగానీ, ఎదుర్కొంటున్న ఆక్రమాల ఆరోపణల గురించి గానీ, అదానితో తనకున్న సంబంధాల గురించిగాని కనీసం ప్రస్తావించలేదు. అభివృద్దిని చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) చేస్తున్న దాడులే ప్రతిపక్షాలను ఏకం చేస్తోందని అన్నారు. ప్రధాని ఈ వైఖరిని ప్రతిపక్షాలు తీవ్రంగా నిరసించాయి. ఆయన ప్రసంగం సాగుతున్న సమయంలోనూ, ఆ తరువాత కూడా ప్రధాని తీరుపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అంతకుముందు ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగం దేశ ప్రజలకు మార్గదర్శనం చేసిందని అన్నారు. ఆ ప్రసంగానికి హాజరు కాని ఒక పెద్ద నాయకుడు ప్రసంగాన్ని విమర్శించారని అన్నారు. గతంలో భారత్ సమస్యల పరిష్కారం కోసం ఇతరులపైన ఆధారపడేదని, నేడు భారతే ఇతర సమస్యలను పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. నేడు భారత్ జి-20 దేశాలకు నాయకత్వం వహిస్తోందని అన్నారు. ఇది కొంతమందికి కంటగింపుగా ఉందన్నారు. అనేక దేశాలను నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్నాయని, భారత్ మాత్రం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని అన్నారు. భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం చూసి కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేశానని, ప్రజలకు తనపై విశ్వాసం ఉందని చెప్పారు. గతంలో కొందరు ఒకే కుటుంబానికి సేవ చేశారని, తాను దేశ వ్యాప్తంగా ఉన్న 25 కోట్ల కుటుంబాలకు సేవ చేస్తున్నానని చెప్పారు. ఒకప్పుడు రైల్వే అంటే యాక్సిడెంట్లు గుర్తుకొచ్చేవని, నేడు వందే భారత్ రైళ్లు చూసి ప్రజలు గర్వపడుతున్నారని అన్నారు. 2004 నుంచి 2014 వరకూ దేశంలో అవినీతి రాజ్యమేలిందని ప్రధాని ఆరోపించారు. దేశంలో ఆ పదేళ్లు రక్తపుటేర్లు పారాయన్నారు. భారత్ తీవ్రంగా నష్టపోయిందన్నారు. కాశ్మీర్‌లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ముగియడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఇప్పుడు అందరూ కాశ్మీర్‌కు వెళ్లి వస్తున్నారని, ఒకప్పుడు ఆ పరిస్తితి ఉండేది కాదని అన్నారు. దేశంలో 70 సంవత్సరాలలో 70 ఎయిర్‌పోర్టులు నిర్మిస్తే, తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలోని 70 ఎయిర్‌పోర్టులు నిర్మించిందని మోడీ పేర్కొన్నారు. జల మార్గాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరోవైపు మోడీ ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు అడ్డుకున్నారు. అదానీ వ్యవహారంపై జెపిసి వేయాలన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకపోవడంతో బిఆర్‌ఎస్ సభ నుంచి వాకౌట్ చేసింది.



ఆరోసారి 'వడ్డి'ంపు

- రెపోరేటు పావు శాతం పెంచిన ఆర్‌బిఐ

ముంబయి : భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) వరుసగా ఆరోసారి వడ్డీ రేటు బాదుడును కొనసాగించింది. రెపోరేటును మరో పావు శాతం అంటే 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. తాజాగా ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) విధాన సమీక్ష బుధవారం ముగిసింది. తాజా పెంపునతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత ప్రియం కానున్నాయి. గతేడాది మే నుంచి రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. చమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా భారత భవిష్యత్ అంచనాలు అస్పష్టంగానే ఉన్నాయని శక్తికాంత దాస్ అన్నారు. ప్రజలు ఇకపై నాణేలు సులభంగా పొందేందుకు వీలుగా ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద 12 నగరాల్లో కాయిన్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేయనున్నామన్నారు.

అదానీ వైపా? ప్రజల పక్షమా?

- వైసిపి, టిడిపి తేల్చుకోవాలి
- రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం : వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

దేశాన్ని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా దోచుకుంటున్న అదానీ కుంభకోణాలపై పార్లమెంటులో జరుగుతున్న చర్చల్లో వైసిపి, టిడిపి ఎంపిలు ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేశంలో అన్ని ప్రతిపక్షాలూ పార్లమెంటులో అదానీ కుంభకోణాలపై జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ చేయాలని డిమాండ్ చేస్తుంటే రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు ప్రజల పక్షమా? అదానీ పక్షమా? తేల్చుకోవాలన్నారు. బుధవారం నాడు ప్రకాశం జిల్లా ఒంగోలు వచ్చిన ఆయన సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డొల్ల కంపెనీల పేర్లతో షేర్లు కొనుగోలు చేయడం తదితర చర్యల వల్ల రూ.3 లక్షల కోట్ల నష్టం జరిగిందన్నారు. ఈ కుంభకోణాలను హిండెన్‌బర్గ్ సంస్థ వెలుగులోకి తేవడంతో అదానీ అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయని, షేర్లు కుప్పకూలిపోయాయని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ఎస్‌బిఐ, ఎల్‌ఐసి నుంచి ఎవరి అనుమతితో అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రధాని మోడీ ఆమోదంతోనే ఇదంతా జరిగిందన్నారు. దీనిపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా వైసిపి, టిడిపి ఎంపిలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్రం కలిపి రాష్ట్రంలోని కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీకి కట్టబెట్టాయని విమర్శించారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయంపై 22 నుంచి 28 వరకూ ప్రచారోద్యమం

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయంపై ఈ నెల 22 నుంచి 28 వరకూ ప్రచారోద్యమం చేపడుతున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రాజధానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం వంటి జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కోరినా ఇవ్వలేదని తెలిపారు. కర్ణాటకలో ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం అప్పర్ భద్రకు రూ.5,300 కోట్లు ఇచ్చి రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు తెరలేపారని విమర్శించారు.

ప్రజలకు వాస్తవాలు తెలపాలి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు మిగతా 2లో

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో
బిజెపికి ఎదురుదెబ్బ

- నామినేటెడ్ సభ్యులకు ఓటింగ్ హక్కు లేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- 13న త్రిసభ్య ధర్మాసనం విచారణ

న్యూఢిల్లీ : మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిన బిజెపి నామినేటెడ్ సభ్యుల ఓటింగ్‌తో పాగా వేయాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఈ మేరకు సుప్రీంకోర్టులోనూ ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నామినేట్ చేయబడిన సభ్యులను కార్పొరేషన్ సమావేశాల్లో ఓటు వేసేందుకు రాజ్యాంగం అనుమతించడం లేదని సుప్రీం కోర్టు బుధవారం స్పష్టీకరించింది. ఢిల్లీ మేయర్ ఎన్నికలను వరుసగా మూడోసారి కూడా ఉద్దేశ్యపూర్వకంగానే నిలుపుచేస్తున్నారంటూ ఆమాద్మీ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రొటెమ్ స్పీకర్లకు సుప్రీం నోటీసులు జారీ చేసింది. ఎన్నికైన సభ్యులకు, నామినేటెడ్ సభ్యులకు మధ్య వ్యత్యాసానికి చాలా ప్రాధాన్యత వుందని ఈ కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. దీనిపై ఈ నెల 13న త్రిసభ్య ధర్మాసనం సవివరమైన విచారణ చేపడుతుందన్నారు. అక్రమ మార్గాల ద్వారానైనా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సీనియర్ ఆప్ నేత మనీష్ శిసోడియా విమర్శించారు. తాజాగా సుప్రీం చేసిన వ్యాఖ్యలతో బిజెపికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది ఎఎం సింఘ్వీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విధ్వంసానికి పాల్పడుతున్నవారిపై చేస్తున్న న్యాయపోరాటమని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు సకాలంగా పూర్తి కావాలని రాజ్యాంగంలోని 243 యు అధికరణ పేర్కొంటోందని గుర్తు చేశారు. గతేడాది డిసెంబరు 4న ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయని చెప్పారు. కానీ, మేయర్, డిప్యూటీ మేయర్, స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికలు మాత్రమూ మూడుసార్లుగా నిలిచిపోతూ మిగతా 5లో



కొత్తగా 3,354 బస్సులు

- ప్రభుత్వానికి ఆర్‌టిసి ప్రతిపాదన

● లోపలి పేజీలో.. ●

గ్రామకంఠం భూముల్లోని నివాసితులకు న్యాయం

- కేబినెట్ సబ్ కమిటీ

సుప్రీంలోనూ అస్పష్టతే

- రాజధానిపై ఏమీ చెప్పని కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వమే చెప్పాలంటూ పేచీ
- సమయమొచ్చినప్పుడు చెబుతామంటూ అఫిడవిట్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దాఖలు చేసిన అఫిడవిట్‌లోనూ రాష్ట్ర రాజధానిపై కేంద్ర ప్రభుత్వం అస్పష్ట వైఖరినే అవలంభించింది. ఏమీ చెప్పకుండా ఊరుకుంది. సమయం వచ్చినప్పుడు చెబుతామంటూ దాటవేత వైఖరి అవలంభించింది. బుధవారం దాఖలు చేసిన 14 పేజీల కౌంటర్ అఫిడవిట్ సారాంశం ఇదే! అంతకుముందు రాజ్యసభలో ఇచ్చిన రాతపూర్వక సమాధానంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే తరహా జవాబు ఇవ్వడం గమనార్హం. గత విచారణ సందర్భంగా కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులుగా తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో 'ప్రస్తుత స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పి)లో లేవనెత్తిన వివిధ అంశాలకు జవాబుఇవ్వగల సమర్థత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అందువల్ల ప్రస్తుతానికి ఎటువంటి సమాధానం గానీ, స్పందనను గానీ తెలియచేయలేం. అయితే, భవిష్యత్తులో అవసరమైతే సరైన సమయంలో జవాబిచ్చే హక్కు మాకుంది' అని పేర్కొంది. ఈ జవాబుతో పాటు, రాష్ట్ర రాజధాని నిర్ణయమైన తీరును, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల చట్టం తీసుకురావడం, అనంతరం పరిణామాల్లో రద్దు చేయడం తదితర అంశాలను వివరించింది.మూడు రాజధానులకు సంబంధించి తమతో చర్చించలేదని పేర్కొంది. నిపుణుల కమిటీ సిఫారసులు, సెక్షన్ 5, 6, 94కు సంబంధించిన డాక్యుమెంట్లు, 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ సిఆర్‌డిఎ చట్టంతో కూడిన జీవో 97 కాపీలను కేంద్రం జతచేసింది. అందులో రాజధానిపై అభిప్రాయం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేసింది. 'రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 5, 6ల ప్రకారం శివరామకష్ణన్ కమిటీ వేశాం. నిపుణుల కమిటీ సూచనలతో అమరావతిని రాజధానిగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. విభజన చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వాలి. రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, శాసనమండలితో పాటు ముఖ్యమైన పట్టణ మౌలిక వసతుల కల్పనకు నిధులివ్వాల్సి ఉంది. కొత్త రాజధాని నిర్మాణానికి రూ.2,500 కోట్లు విడుదల చేశాం" అని అఫిడవిట్ లో పేర్కొంది.

ఎమ్మెల్యే మేకపాటికి గుండెపోటు

- చెన్నైకి తరలింపు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి గుండెపోటు వచ్చింది. మంగళవారం ఆయన ఆత్మకూరులోని తన నివాసంలో ఉండగా గుండెపోటుకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరులోని సుధాకర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.

కేడర్‌ను కాపాడుకునేందుకే టిడిపి ముందస్తు ప్రచారం

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
కేడర్‌ను కాపాడుకునేందుకే టిడిపి ముందస్తు ఎన్నికలంటూ ప్రచారం చేస్తోందని, నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జనం లేరని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలకు చెప్పుకునేందుకు ఏమీ లేదని, తెలుగువాడి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీని చంద్రబాబు ఢిల్లీలో తాకట్టుపెట్టారన్నారు. జగన్ ధైర్యవంతుడు కాబట్టే ఒంటరిగా పోటీ చేస్తామంటున్నారని, టిడిపి సింగిల్‌గా పోటీ చేసే ధైర్యముందా? అని మంత్రి ప్రశ్నించారు. అమరావతి రైతుల పాదయాత్రలో రైతులు అవునో.. కాదో ఐడెంటిటీ చూపమంటే చూపలేక యాత్రను తన నియోజకవర్గం నుంచే వెనుదిరిగారన్నారు. కోటంరెడ్డి ఫోన్ ట్యాపింగ్ అంశంపై స్పందిస్తూ.. ఆయనకు వేరొక అజెండా ఉ ందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మధ్యాహ్న భోజనం కలుషితం

- 30 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం)
మధ్యాహ్న భోజనం కలుషితం కావడంతో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గుర్యారు. ఈ సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కోన గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో బుధవారం చోటుచేసుకుంది. కోన గ్రామంలోని ఎంపియుపి పాఠశాలలో 144 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం వారిలో 30 మంది కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. దీంతో పాఠశాల సిబ్బంది మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హరికృష్ణ సమాచారం అందించారు. హరికృష్ణ తన సిబ్బందితో పాఠశాలకు చేరుకొని వైద్యసేవలు అందించారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని తమ పిల్లలను పిహెచ్‌సికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. విద్యార్థులంతా క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఒ జనార్ధన్‌రావు, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ, ఎంఇఒ మల్లేశ్వరరావు ఆస్పత్రికి వచ్చి విద్యార్థులను పరామర్శించారు. పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు పెట్టిన ఆహారాన్ని, తాగునీటిని పరిశీలించారు. అనంతరం వంట గదిని, ఆహారాన్ని సీజ్ చేసి ఆహార భద్రత అధికారులకు సమాచారం ఇచ్చారు.

సొంత పార్టీ నేతల చీత్కారాలతో ముందస్తుకు జగన్

- అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సొంత పార్టీ నేతల చీత్కారాలకు తోడు ఇటీవల చంద్రబాబు, లోకేష్‌కు ప్రజల్లో పెరుగుతన్న ఆదరణ చూసే గత్యంతరం లేక సిఎం జగన్ ముందస్తు ఎన్నికల ఆలోచన చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టిడిపి స్ట్రాటజీ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశం అనంతరం ఆయన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులు, బాబాయ్ హత్యకేసు, గతంలోని రూ.లక్ష కోట్ల అవినీతి కేసులు జగన్‌ను వెంటాడుతున్నాయన్నారు. ఉన్న వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ఇటీవల విశాఖలో రాజధాని ఉంటుందనే ప్రకటన చేశారని అన్నారు. సొంత పార్టీకి చెందిన 75 మంది ఎమ్మెల్యేలు జగన్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి 35 నియోజకవర్గాలను ఒక జోన్‌గా, మొత్తం ఐదు జోన్‌లుగా విభజించి భారీగా ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న కడపలో, 22న నెల్లూరులో, 23న అమరావతిలో, 24న ఏలూరులో, 25న విశాఖపట్నంలో జరిగే ఈ ప్రాంతీయ సమావేశాలకు చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగే ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారని అన్నారు. నాలుగేళ్ళ తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రపోయిన జగన్‌ను పల్లెనిద్రలో ప్రజలు నిలదీయాలని కోరారు.

రబీ సాగు అస్తుబిస్తు

- ఫిబ్రవరి వచ్చినా సాగని సేద్యం
- పది లక్షల ఎకరాల్లో తగ్గుదల
- ఇంకా నెలే సమయం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి
ఈ సారి రబీ అస్తుబిస్తుగా సాగుతోంది. జనవరి వెళ్లి ఫిబ్రవరి వచ్చినా పంటల సాగులో అంతగా పురోగతి కనిపించట్లేదు. ఇప్పటికి కావాల్సిన సాగులో పది లక్షల ఎకరాలకుపైన తగ్గుదల కనిపిస్తోంది. నిరుడు ఈపాటికి సాగైన దాని కంటే ఎనిమిది లక్షల ఎకరాలకు పైన లోటు నెలకొంది. రబీ సీజన్‌కు ఇంకా గట్టిగా నెల రోజులే సమయముంది. ఈ వ్యవధిలో సాధారణ సాగును చేరాలంటే ఇంకా పదహారున్నర లక్షల ఎకరాల్లో పంటలు వేయాలి. మార్చి రెండో వారం వరకు నీటి వసతి ఉన్న చోట మాత్రం వరి నాట్లు వేస్తారు. మిగతా పంటలన్నీ దాదాపు ఫిబ్రవరిలోనే సాగు చేస్తారు. ఈ పరిస్థితులను బేరీజు వేసుకుంటే ఈ మారు రబీ సాగు బాగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నీటి వసతి ఉన్నా...

ఈ తడవ రబీలో 58 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. సీజన్ సాధారణ సాగు 57.30 లక్షల ఎకరాలు. జనవరి ఆఖరికి 51.45 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 40.75 లక్షల ఎకరాల్లోనే (79 శాతం) సాగు నమోదైంది. నార్మల్ కంటే 10.7 లక్షల ఎకరాల్లో (21 శాతం) సాగు తగ్గింది. ఈ సమయానికి నిరుడు 49 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది కంటే ఈ ఏట 8.27 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ప్రాజెక్టుల్లో నీరు, భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ రబీ సేద్యం సాగట్లేదు. బోర్లు, కొన్ని ప్రాజెక్టుల కింద వరిపై ప్రభుత్వం నియంత్రణ అమలు చేయడం, ఉత్పాదకాల ధరల పెరుగుదల కూడా సాగు తగ్గడానికి కారణాలుగా చెబుతున్నారు.

ఫిబ్రవరి 1 నాటికి సాగు (లక్షల ఎకరాలు)

పంట	నార్మల్ సాగు	ఈపాటికి కావాల్సిన సాగు	సాగైంది
వరి	19.72	16.92	13.77
ముతకధాన్యాలు	8.17	7.20	6.00
పప్పుధాన్యాలు	24.00	22.97	16.97
ఆహారధాన్యాలు	51.90	47.12	36.75
నూనెగింజలు	3.47	2.50	2.47
మొత్తం	**57.30**	**51.45**	**40.75**

ఆహార ధాన్యాలు సైతం

ఆహార ధాన్యాలు ఇప్పటికి కావాల్సిన సాగు కంటే 10.37 లక్షల ఎకరాల్లో (22 శాతం) తగ్గాయి. నిరుటి కంటే 8.3 లక్షల ఎకరాల్లో తగ్గాయి. ప్రధానంగా వరి 3.15 లక్షల ఎకరాల్లో (19 శాతం) తగ్గింది. గతేడాది కంటే 3 లక్షల ఎకరాల్లో తగ్గింది. రబీలో వరి కంటే ఎక్కువ పప్పుధాన్యాలు సాగవుతాయి. ఈ తడవ వాటి సాగు కూడా 2.4 లక్షల ఎకరాల్లో (26 శాతం) తగ్గాయి. పప్పుల్లో శనగ సాగు ఎక్కువ. ఈపాటికి శనగ సాగు దాదాపు పూర్తి కావాలి. కానీ 73 శాతమే సాగైంది. మినుములు 82 శాతం, పెసలు 82 శాతమే సాగయ్యాయి.

ముతకధాన్యాల సాగు లక్ష ఎకరాల్లో తగ్గింది. మొత్తమ్మీద మొక్కజొన్న ఒక్కటే పర్వాలేదనిపిస్తోంది. రబీలో నూనెగింజల సాగు తక్కువ కాగా వాటి సాగు కూడా అతంతమాత్రంగానే ఉంది.

చిత్తూరులో తక్కువ... సత్యసాయిలో ఎక్కువ

చిత్తూరు జిల్లాలో రబీలో రాష్ట్రంలోనే తక్కువ సాగు నమోదైంది. అక్కడ 43 శాతమే పంటలు సాగయ్యాయి. సత్యసాయి జిల్లాలో అత్యధికంగా 105 శాతం పంటలు వేశారు. తతిమ్మా జిల్లాల్లో 50 నుంచి 83 శాతం మధ్య సాగు నమోదైంది.

గ్రామకంఠం భూముల్లోని నివాసితులకు న్యాయం

- కేబినెట్ సబ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
సమగ్ర సర్వేలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామకంఠం భూముల్లో నివాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని జగనన్న భూహక్కు- భూరక్షపై కేబినెట్ సబ్ కమిటీ పేర్కొంది. సబ్ కమిటీ భేటీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగింది. సబ్ కమిటీలో సభ్యులైన మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. దేశంలో సర్వే ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రమే ముందంజలో ఉందన్నారు. జగనన్న భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో భాగంగా 2023 డిసెంబరు నాటికి మొత్తం 17,461 గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. ఇప్పటి వరకు 4.3 లక్షల సబ్ డివిజన్లలో సుమారు 2 లక్షల మ్యుటేషన్లను పరిష్కరించామని తెలిపారు. ఈ ఏడాది మే నెల నాటికి 6 వేల గ్రామాలు, ఆగస్టు నెల నాటికి 9 వేల గ్రామాలు, అక్టోబరు నాటికి 13 వేల గ్రామాలు, డిసెంబరు నాటికి మొత్తం 17,461 గ్రామాలకు భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

భూ యజమానుల నుంచి వచ్చే ఫిర్యాదులపై కూడా మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారించి, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని అధికారులకు మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో సిసిఎల్ఎ జి సాయి ప్రసాద్, సర్వే సెటిల్‌మెంట్ కమిషనరు సిద్ధార్థ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరు ప్రవీణ్‌కుమార్, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ సౌరబ్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ విజి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

14న గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణస్థాయిలో రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తున్న సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 14న కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తెలిపింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ పెద్దన్న, ఎం బాలకాశి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఫేస్‌యాప్ అటెండెన్స్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. కాగా కెజిబివిలో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి 23 శాతం, వీరితో సమానంగా పిజిటిలకు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బాలకాశి హర్షం వ్యక్తం చేశారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో సభ పెట్టుకోవాలా?

- సమావేశాలు నిర్వహించరాదని రాజ్యాంగంలో ఎక్కడ ఉంది? : లోకేష్
- ఎన్ఆర్‌పేటలో 'యువగళం' సభను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
సభ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ పెట్టాలని, తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకోవాలా? అని పోలీసుల తీరుపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను చిత్తూరు రూరల్ పరిధిలోని ఎన్ఆర్‌పేటలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బహిరంగంగా ప్రసంగించకూడదంటూ, సభకు అనుమతులు లేవంటూ చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యాన పోలీసులు సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. జిఒ-1 ప్రకారం రోడ్లపై సమావేశానికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ పెట్టాలని లోకేష్ ప్రశ్నించారు. సమావేశాలు నిర్వహించరాదని రాజ్యాంగంలో ఎక్కడ ఉందో చూపాలంటూ రాజ్యాంగాన్ని పట్టుకుని డిఎస్‌పితో వాదించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ సభను జరిపి



రాజ్యాంగాన్ని చూపుతూ డిఎస్‌పిని ప్రశ్నిస్తున్న లోకేష్

తీరుతామని టిడిపి నేతలు హెచ్చరించడంతో భారీ స్పీకర్లు, వాహనంపై నుంచి ప్రసంగానికి పోలీసులు నిరాకరించారు. లోకేష్ చేతిలోని మైకును లాక్కోవడానికి ప్రయత్నించారు. దీంతో కార్యకర్తల మధ్య సాధారణ మైకుతోనే లోకేష్ ప్రసంగించారు. 2024 ఎన్నికల తర్వాత జగన్‌కు భయం ఎలా ఉంటుందో చూపిస్తామని, పోలీసులను అడ్డం పెట్టుకుని ఆంక్షల పేరుతో పాదయాత్రను అడ్డుకోవడం సాధ్యం కాదన్నారు. అధికార పార్టీ నేతలకు ఆంక్షలు వర్తించవా? అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, జగన్, షర్మిల, రాహుల్‌గాంధీ పాదయాత్రలకు లేని ఆంక్షలు తమ యాత్రకు ఎందుకని ప్రశ్నించారు. అంతకు ముందు కృష్ణాపురంలో యువతీ, యువకులు, అయ్యనవేడు గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు చంద్రబాబు నాయుడు పాలనలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. యువత ఆలోచించాలని కోరారు. బిసిలకు రాజకీయ స్వాతంత్ర్యం 1983లో వచ్చిందన్నారు. బలహీనవర్గాల్లో పేదరికం ఉండకూడదనేదే చంద్రబాబు లక్ష్యమని, కులవృత్తులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఐదేళ్లలో రూ 29 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధుల ద్వారా బిసిలకు ఖర్చు చేశామన్నారు. రాయలసీమ జిల్లాల నుంచి వలసలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే కార్పొరేషన్లకు నిధులు కేటాయించి బిసిలను ఆదుకుంటామని తెలిపారు. య౹ ౹ ౹ వ గ ౹ ళ ౹ ం పాదయాత్ర 13వ రోజు బుధవారం చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లి నుంచి ప్రారంభమై కృష్ణాపురం మీదుగా ఎన్ఆర్‌పేటకు చేరుకుంది. గురువారం జీడీనెల్లూరు మండలంలోని ఆత్మకూరు ముత్యాల గుడి నుంచి యాత్ర కొనసాగనుంది.

యాత్ర అంటే భయమెందుకు : మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

యువగళం పాదయాత్ర అంటే భయమెందుకని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా పాదయాత్రను అడ్డుకోలేరని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఎంత నిర్బంధించినా యువగళం పాదయాత్ర జరిపి తీరుతామని తేల్చిచెప్పారు.



కొత్తగా 3,354బస్సులు

ప్రభుత్వానికి ఆర్‌టిసి ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
కొత్త బస్సుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కసరత్తు చేస్తోంది. ఇప్పుడు ఉన్న కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఆధునిక సౌకర్యాలు కలిగిన కొత్త వాటిని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. 3,354 బస్సులు అవసరమౌతాయని, వాటికోసం 1,477 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిఉంటుందని ఈ ప్రతిపాదనల్లో పేర్కొంది. వీటిలో కనీసం 1,000 ఎలక్ట్రిక్ బస్సులు ఉండాలని కోరింది. దీనితో పాటే ఆస్తులు, అప్పులపై కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 3360 కోట్లతో పెట్టుబడి వ్యయానికి నిర్ణయించింది. అలాగే బస్సు స్టేషన్ల ఆధునీకరణ, బస్ షెల్టర్లు, డిపోలు, కార్యాలయాల భవనాలు, ప్రయాణీకులకు సౌకర్యాలు, ఆర్టీసీ స్థలాల అభివృద్ధికి మరో 135 కోట్లు వెచ్చించాలని భావిస్తోంది.

జీతభత్యాలకు 4026 కోట్లు

ప్రజా రవాణా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, ఇతర భత్యాలకు 4026 కోట్లు కావాల్సి ఉంటుందని ఆర్టీసీ పేర్కొంది. అలాగే పలు వర్గాలకు అందిస్తున్న బస్సు పాస్ రాయితీల కింద మరో 620 కోట్లు కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బస్సుల కొనుగోలుకు అవసరమయ్యే 1477 కోట్లను కూడా ప్రభుత్వం భరించాలని కోరినట్లు తెలిసింది.

ఆదాయ వ్యయాల మధ్య అంతరం

సంస్థ ఆదాయ వ్యయాల మధ్య భారీ అంతరాలు చోటుచేసుకుంటున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం 7340 కోట్లుగా అంచనా వేయగా, వ్యయం 9049 కోట్లుగా భావిస్తున్నారు. దీంతో ఏడాది ముగిసే సరికి 1745 కోట్లు నష్టంగా ఉంటుందని చెబుతున్నారు. వచ్చే నెలతో ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో కూడా నష్టం 1733 కోట్లుగా గణించారు. గతేడాది కన్నా ఈ సారి ఎక్కువ రూట్లలో బస్సులు తిప్పనున్నట్లు సంస్థ చెబుతోంది. గతేడాది 148 కోట్ల కిలో మీటర్లు బస్సులు తిరగ్గా, రానున్న సంవత్సరంలో 155 కోట్ల కిలోమీటర్ల వరకు బస్సులు తిప్పాలని ప్రతిపాదిస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో అఘాయిత్యం

- ఒకరిపై అత్యాచారం, మరొకరిపై అసభ్యప్రవర్తన
- పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)
ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు మండలంలో వేర్వేరు ఘటనల్లో పోక్సో చట్టం కింద రెండు కేసులు నమోదయ్యాయి. ముండ్లమూరు ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన యువతి విశాఖపట్నంలో ఇంజినీరింగ్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన వెంకట నారాయణరెడ్డి యువతి హాస్టల్ వద్దకు వెళ్లి తనకు పార్శల్ వచ్చిందని చెప్పి బయటకు తీసుకెళ్లాడు. అనంతరం ఆమెపై అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తానని బెదిరించాడు. జరిగిన విషయాన్ని ఇటు తల్లిదండ్రులకు, అటు స్నేహితులకు చెప్పలేక జనవరి 13న యువతి తనసొంత గ్రామానికి వచ్చి పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకుంది. తర్వాత తల్లిదండ్రులు ఆమె సెల్‌ఫోన్‌ను పరిశీలించగా.. విషయం అర్థమై.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వెంకటనారాయణరెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంపంత్ కుమార్ తెలిపారు.

మండలంలోని బొప్పిడివారిపాలెం గ్రామానికి చెందిన లామ్ గోవిందయ్య గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. గ్రామానికి చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక టిఫిన్ సెంటర్‌కు వెళ్లి.. ఇడ్లీ కట్టించుకుంది. అందులో చట్నీ లేకపోవడంతో ఇంటి నుంచి ఆ బాలిక తిరిగి టిఫిన్ సెంటర్‌కు వచ్చింది. ఆ సమయంలో గోవిందయ్య బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఏడుస్తూ తన తల్లి వద్దకు వెళ్లి జరిగింది చెప్పగా ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గోవిందయ్యపై పోక్సో చట్టం కింద కేస్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మరడపాలెంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ఎయిర్‌పోర్టు నిర్వాసితులను బలవంతంగా తరలించొద్దు

- ఏప్రిల్ వరకు అవకాశమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి
ఎయిర్‌పోర్టు నిర్వాసితుల తరలింపునకు ఏప్రిల్ నెలాఖరు వరకు అవకాశం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈలోగా నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలని, మిగిలిన వారందరికీ ప్యాకేజీలు అందజేయాలని కోరారు. ఇప్పటికిప్పుడు తరలిపోవాలంటూ ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. విజయనగరంలోని భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామాలైన మరడపాలెం, బొల్లెంకులపాలెం, రెల్లిపేట, ముడసర్లపాలెంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు బచ్చల సూర్యనారాయణతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. లింగాలవలస, గూడెపువలసల్లో చేపట్టిన నిర్వాసిత కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతల ఎదుట నిర్వాసితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదంటూ మరడపాలెంలో మహిళలు, యువకులు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీలు వర్తింపజేయడంలేదన్నారు. తమ గ్రామంలో 240 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వలస కూలీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వపోవడం వల్ల వారంతా ఇబ్బంది పడుతున్నారని సర్పంచి కొండపు కొత్తయ్యరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, తాగునీరు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశానవాటిక వంటి సదుపాయాలు కల్పించకుండా నిర్వాసిత కాలనీకి వెళ్లేందుకు తాము సిద్ధంగా లేమని అదే గ్రామానికి చెందిన శివ అనే యువకుడు చెప్పాడు. తమకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో రాలేదంటూ రెల్లిపేటకు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తాగునీరు, విద్యుత్ తదితర సదుపాయాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యం ఉందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తే నిర్వాసితులు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలా కాకుండా పోలీసులతో బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికే మరడపాలెం, బొలెంకలపాలెంలో ఏకపక్షంగా ఇళ్లను కూలగొట్టారని, ఈ పద్ధతి మానుకోకపోతే నిర్వాసితులను కూడగట్టి మరో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రానికి ఫిర్యాదు

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు
తన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై దర్యాప్తు చేయాలంటూ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశానని, ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాశానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్తానని, ఆ శాఖ నుంచి అపాయింట్‌మెంట్ లభిస్తే నేరుగా వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపిస్తుంటే అందుకు స్పందించి విచారణ చేపట్టకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూషించడం, కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ మంత్రులు శాపనార్థాలు పెట్టడం మంచిది కాదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ జరగకపోతే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

నేనే ఫోన్ రికార్డు చేశా! :లంకా రామశివారెడ్డి

" కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నేను కాలేజీ రోజుల నుంచి స్నేహితులం. అనేక విషయాలు మాట్లాడుకుంటాం. ఇటీవల ఓ రోజు అలా మాట్లాడుకున్నాం. అది నేను రికార్డు చేశా. అది మరో స్నేహితుడికి పంపాను " అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్నేహితుడు లంకా రామశివారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వంపై కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శలు చేశారని, ఆ రోజు తనతో ఫోన్‌లో మాట్లాడిన దానిలో ఓ కాంట్రాక్టర్ విషయం చెప్పారని, దానిని రికార్డు చేశానని, అది ఆ కాంట్రాక్టర్‌కు పంపానని తెలిపారు. ఆ రికార్డు ఇంత పెద్ద సమస్యగా మారి, రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పుకునే స్థితికి వచ్చిందన్నారు. అందుకే నేను మీడియా ముందుకు వచ్చి విషయం చెబుతున్నానని, నన్ను ఎవరూ బెదిరించలేదని తెలిపారు. అనంతరం మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆయన వెళ్లిపోయారు.

అదానీ వైపా? ప్రజల పక్షమా?

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవాలు తెలిసేలా ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గడిచిన నాలుగేళ్లలో ఇప్పటివరకూ ఏడాదికి రూ.45 వేల కోట్ల చొప్పున అప్పులు పెరిగాయన్నారు. ఇది రాష్ట్ర బడ్జెట్లో 25 శాతంగా ఉందన్నారు. ప్రస్తుతం రూ.4.42 లక్షల కోట్లకు అప్పు చేరిందని తెలిపారు. అప్పులు తెచ్చినా ఈ రోజుకూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం పథకానికి సరుకులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఇంతటి ఆర్థిక సంక్షోభానికి ఎవరు కారణమో ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు ముందే అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ప్యాకేజీలు ఇచ్చాకే ప్రాజెక్టును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆగస్టు వరకూ వయోపరిమితిని పరిగణనలోకి తీసుకుని నిర్వాసితుల జాబితా ఖరారు చేయాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధమని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కేంద్రం అన్ని పార్టీలపై నిఘా పెట్టినప్పుడు వైసిపి కూడా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

భయం వద్దు..అండగా నేనుంటా..!

- ప్రజాప్రతినిధులకు 'ఆదాల' భరోసా

ప్రజాశక్తి - నెల్లూరు

ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులందరికీ తాను అండగా నిలుస్తానని నెల్లూరు ఎంపి, రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్, సొసైటీ ఛైర్మన్ సభ్యులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులకు అండగా నిలిచి ప్రజాసమస్యల పరిష్కారానికి, ఆయా ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూరల్ నియోజకవర్గం తనకు కొత్త కాదని, ఐదేళ్లపాటు ఈ పరిధిలో నిర్వహించిన, చేపట్టిన కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మద్దతు కూడా మనకు ఉందన్నారు. త్వరలో రూరల్ నియోజకవర్గంలో తాను పర్యటిస్తానని, ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆనం అరుణమ్మ, ఆనంవిజయకుమార్ రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ఎడిటర్ సాయిలక్ష్మికి పితృవియోగం

ప్రజాశక్తి- విజయవాడ



ప్రజాశక్తి దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిలక్ష్మికి పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి పలిశెట్టి బాలకృష్ణ (83) వయోభారంతో బుధవారం ఉదయం మరణించారు. బాలకృష్ణకు ముగ్గురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు ఉన్నారు. సాయిలక్ష్మి మూడవ కూమార్తె. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయవాడ జక్కంపూడి కాలనీలోని నివాస గృహం వద్ద ఉంచిన బాలకృష్ణ భౌతికకాయాన్ని ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాలకృష్ణ మృతికి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు సంతాపం తెలిపారు.

మహిళల భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి

- స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడచినా నేటికీ వివక్ష
- మహిళా ఫెస్ట్ ప్రారంభోత్సవంలో ప్రముఖ రచయిత్రి ఓల్గా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



అమెరికా మహిళా క్రికెట్ కెప్టెన్ కొడాలి గీతికకు జ్ఞాపికలు అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

స్వాతంత్య్రానంతరం దేశాభివృద్ధిలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించలేదని, అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు సగభాగం అవకాశాలు కల్పించి ఉంటే ప్రస్తుతం దేశం ఇలా ఉండేది కాదని ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఓల్గా అన్నారు. 'తరుణీ తరంగాలు' ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 5వ మహిళా ఫెస్ట్ ప్రారంభమైంది. తొలుత జాతీయ పతాకాన్ని ఓల్గా, తరుణీ తరంగాలు పతకాన్ని అమెరికా అండర్ -19 మహిళా క్రికెట్ కెప్టెన్ కొడాలి గీతిక ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఓల్గా ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ళు గడిచిన నేటికీ మహిళల పట్ల వివక్ష అన్ని రంగాల్లో కనిపిస్తూనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు ఇచ్చి ఉంటే మహిళాభివృద్ధి సాధ్యమయ్యేదని పేర్కొన్నారు. మహిళలకు విద్యావశ్యకతను తొలిసారి గుర్తించి, దేశంలో దీనిని ప్రోత్సహించిన సావిత్రీబాయ్ ఫూలే జీవితం మహిళలకు ఆదర్శమన్నారు. అంతకంటే ముఖ్యంగా రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సమాజంలో ఏ వివక్ష ఉండకూడదని, ముఖ్యంగా కుల, మత, వర్గ, వర్ణ, లింగ వివక్ష లేకుండా అందరూ సమానమని ఆర్టికల్ 15 చెబుతోందని గుర్తు చేశారు. ఎక్కడైనా వివక్షకు పాల్పడితే నేరమని హెచ్చరిస్తోందన్నారు. మహిళలు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. చరిత్రను విస్మరిస్తే భవిష్యత్తు ఉండదన్నారు. కొడాలి గీతిక మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని తెలిపారు. ముందు నుండి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అందుకోసం నిత్యం శ్రమించాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణంగానే తాను అండర్ -19 జట్టు వరకు ఎదిగినట్లు తెలిపారు. బాలోత్సవ్, ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ.. తరుణీతరంగాలు మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తున్నాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన తరుణీ తరంగాలు అధ్యక్షులు డాక్టర్ రావి శారద మాట్లాడుతూ నాలుగుసార్లు మహిళా ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించామని, ప్రస్తుతం 5వ ఫెస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. తొలుత తరుణీ తరంగాలు కార్యవర్గ సభ్యురాలు కె.శ్రీదేవి అతిథులకు స్వాగతం పలుకగా, తరుణీ తరంగాల ప్రతినిధులు డాక్టర్ ఎన్.విద్యాకన్నా, డి.రమాదేవి, డాక్టర్ కె.సత్యవతి, డాక్టర్ రెజీనా, డాక్టర్ ఎస్.కల్పన తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. గురువారం కూడా మహిళా ఫెస్ట్ కొనసాగుతుంది.

ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించొద్దు

- రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షులు పాపారావు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న పాపారావు

పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వమే పిఎంఎఫ్ఎస్ లింకేజ్ ఉన్న బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం విస్తృతస్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పాపారావు మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించకుండా పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. సర్పంచ్‌లు కూడా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఉందని, కానీ నిధులు లేక ఏమీ చేయలేకపోతున్నామని తెలిపారు. రాబోయే 15వ ఆర్థిక సంఘం నిధులు సిఎఫ్ఎంఎస్ అకౌంట్లలో కాకుండా పిఎఫ్ఎంఎస్ ఖాతాల్లో వేయాలని ఫిబ్రవరి నెలాఖరులో కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు. సర్పంచ్‌లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.15 వేలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీలకు సమాంతర వ్యవస్థగా ఏర్పాటు చేసిన సచివాలయాలను పంచాయతీల అధీనంలో పనిచేసే విధంగా మార్పు చేయాలని కోరారు. సర్పంచ్‌ల విధులు, నిధుల కోసం రాబోయే రోజుల్లో రాజకీయాలకతీతంగా పెద్ద ఎత్తున పోరాడతామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులుగా ముప్పాళ్ల మనోహర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు, నాయకులు చందు సాంబశివరావు, అల్లాబక్షు పాల్గొన్నారు.

జూమ్‌లో 1300 ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ మీటింగ్‌లకు ప్రధాన వేదికగా గుర్తింపు తెచ్చుకున్న జూమ్ తమ సంస్థలో భారీగా ఉద్యోగులను తొలగించింది. 1300 మందిపై వేటు వేసినట్లు ప్రకటించింది. ఇది ఆ సంస్థ మొత్తం ఉద్యోగాల్లో 15 శాతానికి సమానం కావడం ఆందోళకరం.

రుణాలు మరింత భారం

- మళ్లీ వడ్డీ రేట్లు పెంపు
- నాణేల జారీకి మిషన్లు
- ఆర్‌బిఐ ఎంపిసి నిర్ణయం

ముంబయి : రుణ చెల్లింపు వాయిదాలు మరింత భారం కానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రెపోరేటును మరో పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతంగా నిర్ణయించింది. దీంతో గతేడాది మే నుంచి ఇప్పటి వరకు 250 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచినట్లయ్యింది. దీంతో ఇప్పటికే గృహ, వాహన, వ్యక్తిగత అప్పులు తీసుకున్న వారు, కొత్తగా తీసుకోబోయే వారిపై భారం పడనుంది. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) విధాన సమీక్ష బుధవారం ముగిసింది. ఈ భేటీ వివరాలను శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు.. ఆ అంశాలు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ అయినా రిటైల్ ఇ-రూపీ ప్రయోగాలను మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు. ఈ ప్రక్రియలో మరిన్ని బ్యాంకులకు భాగస్వామ్యం కల్పించనున్నామని శక్తికాంత దాస్ తెలిపారు. ఇ-రూపి సేవలను మరో 5 బ్యాంకులు, 9 నగరాలకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. టోకు అవసరాలకు సంబంధించిన ఇ-రూపీ ప్రయోగాలను గతేడాది నవంబర్ 1న, రిటైల్ అవసరాలకు సంబంధించిన ఇ-రూపీని డిసెంబర్ 1న ఆర్‌బిఐ ప్రారంభించింది. ప్రస్తుతం రిటైల్ ఇ-రూపీని ప్రయోగాత్మకంగా 50 వేలమంది వినియోగదారులు, 5 వేల మంది వ్యాపారులు వినియోగిస్తున్నారని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ టి రవి శంకర్ తెలిపారు. ఇ-రూపీ కరెన్సీ వినియోగంలో ఎలాంటి అవరోధాలూ తలెత్తకూడదన్న ఉద్దేశంతో నెమ్మదిగా ఈ విధానాన్ని అందిపుచ్చుకోవాలని నిర్ణయించామన్నారు. గౌతం అదానీపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పై శక్తికాంత దాస్ స్పందించారు. వ్యక్తిగత సంఘటన లేదా ఓ కేసు ద్వారా బ్యాంకులు ప్రభావితం అయ్యే అవకాశం లేదన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా ఉందని, మరింత బలోపేతం చేసుకునేందుకే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ప్రత్యేకమైన పరిస్థితులు ద్రవ్యపరపతి విధానాన్ని సవాలుగా మార్చేశాయని శక్తికాంత దాస్ అన్నారు. ద్రవ్యోల్బణం విషయంలో ద్రవ్య పరపతి విధాన కమిటీ అప్రమత్తంగానే ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24లో ద్రవ్యోల్బణం 4 శాతం లక్ష్యం కంటే ఎక్కువగానే ఉండొచ్చన్నారు.

పెట్టుబడుల ఆకర్షణ కోసం 6 నగరాల్లో రోడ్‌షోలు

- 14 నుంచి 24 వరకు నిర్వహణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే నెలలో విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో భాగంగా కొన్ని ముందస్తు రోడ్‌షోలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ఈ రోడ్‌షోలు నిర్వహించనున్నారు. దీనికోసం రెండు బృందాలను నియమించనున్నారు. మొత్తం ఆరు ప్రధాన నగరాల్లో ఈ రోడ్‌షోలు ఉంటాయి. 14వ తేదీన బెంగళూరులో తొలి రోడ్‌షో ఉంటుంది. 17న చెన్నై, అహ్మదాబాద్‌లో, 21న ముంబయిలో, 22న కోల్‌కతాలో, 24న హైదరాబాద్‌లో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించే సదస్సులో పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలను, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ రోడ్‌షోలు ఉపయుక్తంగా ఉంటాయని చెబుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతోపాటు, విధాన నిర్ణయాల్లో నిష్ణాతులు, ఇతర రంగాల్లో ప్రసిద్ధి చెందిన వారిని కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నారు. ఈ సదస్సు కోసం బిజినెస్ టు బిజినెస్, బిజినెస్ టు గవర్నమెంట్ సమావేశాలు, కీలకాంశాలపై ప్రసంగాలు, రంగాల వారీ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ అంశాలనే రోడ్‌షోల్లో అధికారులు వివరించనున్నారు.

జీతాల ఆలస్యానికి కారణం చెప్పండి ?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - చల్లపల్లి (కృష్ణా)

జీతాల చెల్లింపుల్లో ఎందుకు ఆలస్యం అవుతుందో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగస్తులకు సమయానికి వేతనాలు చెల్లించకపోవడం, ఇతర సమస్యలపై స్పందించకపోవడం వల్ల ప్రభుత్వానికి, ఉద్యోగస్తులకు మధ్య అఘాతం పెరగడం ఎవరికీ మంచిది కాదన్నారు. జీతాలు ఆలస్యం ఎందుకు అవుతున్నదీ, ఇతర ప్రధాన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన కారణాలను ఉద్యోగస్తులకు తెలియచేసేలా శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ రద్దు చేస్తామని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటన తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే రాష్ట్రాలకు రుణాలు, ఇతర రాయితీలు నిలిపేస్తామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎం.సుబ్బారావు, సిహెచ్ రాజీవ్, ఎం.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి

- 6 నెలలుగా ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించని అలవెన్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులమైతే ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయని సంబరపడ్డ ఆర్‌టిసి ఉద్యోగులకు ఇప్పుడున్న సౌకర్యాలనూ తొలగిస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఆరు నెలలుగా ఆర్‌టిసిలో ఓవర్‌టైమ్ (ఓటి) అలవెన్స్ చెల్లించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్న పరిస్థితి ఉంది. ఆర్‌టిసిలో పనిచేసే కండక్టర్లు, డ్రైవర్లది భిన్నమైన జాబ్‌చార్ట్. ప్రభుత్వ ఉద్యోగులు టైమ్‌కు రావడం, టైమ్‌కు పోవడం వంటి వెసులుబాటుతో ఉంటే బస్సుల్లో వెళ్లిన డ్రైవర్, కండక్టర్లు ఎప్పుడు తిరిగి వస్తారనేది స్పష్టతలేని ఉద్యోగం. ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కాకముందు వారు ఎక్కువటైమ్ విధుల్లో ఉంటే ఆ మేరకు ఓవర్‌టైమ్‌కు అలవెన్సు ఇచ్చేవారు. ఆర్‌టిసిలో 1,534 సింగిల్ క్రూ విధుల్లో సగటున 2,800 మంది డ్రైవర్లు, 1,800 మంది కండక్టర్లు ఓవర్‌టైమ్ డ్యూటీలు చేస్తున్నట్లు అంచనా. వీరు మూడు నుంచి నాలుగు గంటలు వరకు అదనపు సమయం విధుల్లో ఉంటున్నారు. గతంలో కార్పొరేషన్‌లో ఉన్నప్పుడు వీరందరికీ ఓవర్‌టైమ్‌ను రెగ్యులర్‌గా ఇచ్చేవారు. ఆర్‌టిసి ప్రభుత్వ విలీన కమిటి కూడా ఓటి మొత్తంను లెక్క కట్టి బస్సుల ద్వారా వచ్చే రోజువారి ఆదాయం నుంచి ఇవ్వాలని సిఫార్సు చేసింది. ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత కొంతకాలం ఓటిలను ఇచ్చిన ఆర్‌టిసిలో కొత్త పిఆర్‌సిని అమలు చేస్తున్నప్పటి నుండి చెల్లింపులను నిలిపేశారు. ఆరు నెలలుగా ఓటిలను నిలిపేయడంతో కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్‌టిసి యజమాన్యం సెప్టెంబరు నుంచి ఓటిలను అందిస్తామని చెప్పినా ఇప్పటిదాకా చెల్లించలేదు. సగటున రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు కండక్టర్లకు, డ్రైవర్లకు ఓటిల బకాయిలున్నాయని, వాటన్నిటినీ తక్షణం చెల్లించి, నెలనెలా వేతనంతోపాటు ఓటిలను చెల్లించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్‌తో పాటు ఆర్‌టిసిలోని అన్నీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటి విధులనైనా తప్పించండి లేదా ఓటి డబ్బులైనా చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఓటిలతోపాటు ఆర్‌టిసిలో ఎన్నో ఏళ్లుగా అమలవుతున్న అలవెన్స్‌లను కూడా నిలిపేశారు. ట్రావెలింగ్ అలవెన్స్‌లు, నైటవుట్ అలవెన్స్, డేఅవుట్ అలవెన్స్‌లను రద్దు చేశారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అలవెన్సులను, ఓటిలను చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

సంపాదకీయం

చర్చకు జంకెందుకు?


అదానీ కంపెనీల పెట్టుబడులు, షేర్ల పతనానికి సంబంధించిన అక్రమాలపై పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే కేంద్ర ప్రభుత్వం అందుకు సిద్ధం కాకపోవడం దారుణం. దేశ అత్యున్నత చట్ట సభలో చర్చ చేపడితే ప్రజల సొత్తును అదానీకి కట్టబెట్టడంలో పెద్దల పాత్ర బయటపడుతుందని కేంద్రం భయపడుతోందన్నది జనవాక్యం. మరోవైపు అదానీపై కుట్ర జరుగుతున్నదనీ, అక్రమాల్లేవంటూ ప్రభుత్వ ప్రతినిధులు చెప్తున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా విదేశీ శక్తులు చేస్తున్న కుట్రని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులంటున్నారు. కాబట్టి అది కుట్రా, కాదా? అన్నది పార్లమెంటులో చర్చిస్తే తేలిపోతుంది. నిజానికి అలాంటి కుట్రలను ప్రభుత్వమే బట్టబయలు చేయాలి. మరి పార్లమెంటులో చర్చించకుండా సర్కారు ఎందుకు నిరోధిస్తున్నదో ఏలినవారికే తెలియాలి. ఏది ఏమైనా ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలి లేదా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి విచారణ జరపాలి. అప్పుడే వాస్తవాలేమిటి? అసలు దోషులెవరన్నది తేలుతుంది.

అదానీ కంపెనీల్లో భారత ప్రభుత్వరంగ దిగ్గజ సంస్థ ఎల్ఐసి వేల కోట్ల రూపాయలు మదుపు చేయగా, ప్రపంచంలోనే అగ్రగామి బ్యాంకుల్లో ఒకటైన ప్రభుత్వ రంగ ఎస్‌బిఐ వేలాది కోట్ల రూపాయల రుణాలిచ్చింది. అదానీ కంపెనీల షేర్ల పతనంతో ఆ ప్రభుత్వరంగ సంస్థలేమవుతాయో తమ సొమ్ము దక్కుతుందో లేదోనని కోట్లాదిమంది పాలసీ హోల్డర్లు, డిపాజిటర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారందరికీ వాస్తవాలు వివరించి, అవసరమైన భరోసా కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే! అది మానేసి ఆ సంస్థలు మునిగిపోయినా, ఖాతాదార్లను ముంచేసినా పర్వాలేదన్నట్లు కేంద్రం వ్యవహరించడం క్షంతవ్యం కాదు. చర్చకు, విచారణకు, సమాధానానికి కేంద్రం సిద్ధంగా లేకపోవడం అన్యాయమే కాదు అప్రజాస్వామికం కూడా! ప్రజా సమస్యలను చర్చించి, వాటికి పరిష్కారాలు చూపడం పార్లమెంటు కర్తవ్యం.

రోడ్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల వంటి మౌలిక వసతులు, వంట నూనెల మొదలు విద్యుత్ రంగం వరకూ దేశంలోని అన్ని రంగాలనూ అదానీ కబళించాడన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఇంతటి 'విజయాలు' సాధిస్తున్న అదానీ వెనుకున్న బలమేంటి? ఆ మాయాజాలమేమిటి? ఏమిటి ఆ అనుబంధం? తదితర ప్రశ్నలకు ప్రజలకు సమాధానం చెపాల్సింది సర్కారు వారే! రక్షణ రంగంలో అదానీకి అనుభవం లేకపోయినా నాలుగు డిఫెన్స్ కాంట్రాక్టులను అప్పగించారు. అదానీ ఎన్నడూ డ్రోన్లను తయారు చేయలేదు. ప్రభుత్వ రంగ హెచ్ఎఎల్ వాటిని తయారు చేసింది. అయినప్పటికీ మోడీ ఇజ్రాయిల్ పర్యటన తరువాత, అదానీకి ఆ కాంట్రాక్టు దక్కింది. ఒకప్పుడు అదానీ విమానంలో మోడీ ప్రయాణించేవారని, ఇప్పుడు మోడీ విమానంలో అదానీ ప్రయాణిస్తున్నారని పార్లమెంటులో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఎవరూ కాదనలేరు కదా! శ్రీలంకలో ఇంధన కాంట్రాక్టులు, బంగ్లాదేశ్‌లో విద్యుత్ కాంట్రాక్టులు...ఇలా ఒకటేమిటి అన్నీ అదానీకి వచ్చేలా ప్రధాని కార్యాలయమే మంత్రాంగం నెరిపిందన్నది బహిరంగ రహస్యం.

స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, ఇతర భారీ అక్రమాలు వెల్లడైన సందర్భాల్లో జాయింట్ పార్లమెంటరీ కమిటీలు నియమించిన చరిత్ర మన దేశానికి ఉంది. ప్రతిపక్షంలో ఉండగా బిజెపి నేతలు అందుకు పట్టుబట్టిన దృష్టాంతాలెన్నో ఉన్నాయి. ప్రపంచమంతటా చర్చనీయాంశంగా మారి దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన అదానీ వ్యవహారంపై ఇప్పటికైనా జెపిసి నియామకానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలి. ప్రతిపక్షాల న్యాయమైన డిమాండ్‌కు తలొగ్గాలి. విపక్షాలు మరింత ఐక్యంగా నిలబడి సర్కారు మెడలు వంచాలి. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండూ పార్లమెంటులో మౌన ముద్ర దాల్చడం తగదు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని నిలదీయడంలో విఫలమవుతున్న ఈ రెండు పార్టీలు ప్రజల సొత్తును స్వాహా చేసిన అదానీ వ్యవహారంలోనూ అలాగే ఉండడం దారుణం. తెలుగువారి పౌరుషాన్ని చూపి, అదానీ కంపెనీల అక్రమాలపై ఎలుగెత్తాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు మరిన్ని అనుమానాలు కలుగుతాయి.

మహనీయుల మాట



జ్ఞానోదయాన్ని కలిగించే మాటలు ఆభరణాల కంటే గొప్పవి.

- బేగం హజరత్ మహల్

విశ్లేషణ

ఆహార భద్రతకు ముప్పు





ప్రొ॥ ఎన్. వేణుగోపాలరావు

మొన్నటి మన్మోహన్–చిదంబరం నుండి నేటి మోడీ–సీతారామన్ వరకూ తమ సంస్కరణలన్నీ భారతదేశాన్ని ఉద్ధరించేందుకేనని చెప్పడం చూశాం. దేశంలో సింహభాగంగా ఉన్న వ్యవసాయ ఆధారిత ప్రణాళికలన్నిటి పైనా కేంద్రీకరిoచామని చెప్పుకొస్తున్నారు. మానవీకరణ అనే పూతతో నడిచే మొన్నటి అభివృద్ధి "ఆత్మ నిర్భరత", "అమృత్ కాల్" కవచాలు తొడిగిన నేటి 'ముందడుగు' రైతుల బాగు కోసమేనన్నారు పాలకులు. మరో అడుగు ముందుకేసి 2023 నాటికి రైతుల ఆదాయాన్ని ద్విగుణీకృతం చేస్తామన్నారు. పాలనా రంగ పైలెట్ చైనాను మించిపోయే ఆర్థిక స్థాయి సాధించబోతున్నట్లు పదే పదే ప్రకటిస్తున్నారు. బుకాయింపు ఏ స్థాయికి వెళ్లిందంటే..."శ్రీ అన్న" పథకం ద్వారా భారత దేశాన్ని చిరుధాన్యాల నిలయంగా (మిల్లెట్ గ్రెయిన్ హబ్) గుర్తింపు తేబోతున్నట్లు పలికారు. తాము ప్రవేశపెట్టే డిజిటల్ సాంకేతికాల నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగడమేగాదు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ స్టార్టప్ సంపదలు సమకూర్చబోతున్నామన్నారు. దాని కోసం ప్రస్తుత బడ్జెట్‌లో 20 లక్షల కోట్ల రూపాయలను కేటాయిస్తున్నారట. పరపతి సౌకార్యాన్ని పెంచారట. ముఖ్యంగా పశుపోషణ డెయిరీలు, జల జంతువుల ఉత్పత్తిదారులకు వీటిని కేటాయిస్తారట. దాన్నే వారు "వ్యవసాయ వేగవంత అభివృద్ధి నిధి"గా ప్రముఖంగా పేర్కొన్నారు. సమాంతరంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం/ సేంద్రియ పంటల సాగులోకి దించబోతున్నారట. దానికి తగిన జీవ సంబంధ లేక సేంద్రియ వనరుల ఉత్పాదకాల కేంద్రాలను నెలకొల్పుతారట. దేశీయంగా రూపొందించబోతున్న బడ్జెట్ రాబోయే 25 సంవత్సరాల ప్రగతికి నాందిగా ఉంటుందట. తమ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటైన మార్కెట్ ధర కల్పించాలని చలిలో, వానలో, ఎండలో వీధుల్లో నిలబడి రైతులు పోరాడారు. పని లేకపోవడంతో రైతు కూలీలు వలసబాట పట్టారు. ఆహార భద్రతా చట్టం నీరుగారిపోయిందని ఆకలి చావులు సూచిస్తున్నాయి. పౌష్టికాహారం అందని కుటుంబాలు, బరువు తక్కువ పిల్లలు, రక్తహీనతకు గురవుతున్న మహిళలు దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ సూచికలు బహిర్గతపరుస్తూనే ఉన్నాయి. అయినాసరే నిస్సిగ్గుగా అబద్ధాలతో, దొంగ అంకెలతో, ఆర్థిక సర్వేలు, బడ్జెట్లు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆహార పంపిణీ వ్యవస్థను, ఉపాధి హామీ చట్టాలను నీరుగార్చే కేటాయింపులు, విశ్లేషణలు, మాటల గారడీ ప్రావీణ్యతను సూచిస్తూనే ఉన్నాయి. గద్దెనెక్కే ముందు చేసిన వాగ్దానాలకు, రైతు ఉద్యమాలకు భయపడి వ్యక్తపరిచిన క్షమాపణలకు విలువ లేకుండా చేసిన 'దేశభక్తులు' ఈ పాలకులు. వీరికి "ఆహార ఉత్పత్తిదారుల" సంక్షోభం, సామాన్య ప్రజల బతుకు పోరాటం అర్థమవుతుందని వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తారని ఆశించడం అవివేకం.

తమ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటైన మార్కెట్ ధర కల్పించాలని చలిలో, వానలో, ఎండలో వీధుల్లో నిలబడి రైతులు పోరాడారు. పని లేకపోవడంతో రైతు కూలీలు వలసబాట పట్టారు. ఆహార భద్రతా చట్టం నీరుగారిపోయిందని ఆకలి చావులు సూచిస్తున్నాయి. పౌష్టికాహారం అందని కుటుంబాలు, బరువు తక్కువ పిల్లలు, రక్తహీనతకు గురవుతున్న మహిళలు దేశంలో ఎక్కువగా ఉన్నారని అంతర్జాతీయ సూచికలు బహిర్గతపరుస్తూనే ఉన్నాయి. అయినాసరే నిస్సిగ్గుగా అబద్ధాలతో, దొంగ అంకెలతో, ఆర్థిక సర్వేలు, బడ్జెట్లు నిర్వహిస్తూనే ఉన్నారు.

అవగాహనా వైరుధ్యం

ఈ దేశంలోని పాలకులకేగాదు, విస్తరణ–పరిశోధనా రంగ నిపుణులకు, పారిశ్రామిక రంగ ప్రముఖులకు అసలు వ్యవసాయం వృత్తా? వ్యాపకమా లేక వ్యాపారమా? అనేది అర్థం కాలేదు. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించలేక మన ప్రణాళికలన్నీ నడిచాయి. ఓడ నుండి నోటి కాడికి, పొలం నుండి పళ్లెం వరకూ పథకాలు నడపబడ్డాయి.

ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఖండ వ్యవసాయ ఆధారిత దేశాల రైతులు రూపొందించుకున్న పంట విత్తనాలను విస్తరింపచేసిన శాస్త్రవేత్తలు, పారిశ్రామిక విప్లవ నేపథ్యంలో రూపొందించబడిన కృత్రిమ ఎరువులు, సస్య రక్షణ మందులు ఆధారంగా రూపొందిన పరిశ్రమాధిపతులు...భారత వ్యవసాయ స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలను "హరిత విప్లవం" అనమని చెప్పారు. ఆ మలుపులే భారతదేశ వ్యవసాయ వృత్తిని వ్యాపారంగా మార్చిందనుకోవచ్చా? అయినా ఈ మలుపులో ఇమడ లేని ఆదివాసీలు, వెనుకబడిన ప్రాంత గ్రామీణ వృత్తిదారులు ఇంకా వ్యవసాయాన్ని వృత్తిగానే భావిస్తున్నారనేది వాస్తవం. 1950–60 వరకూ 70 శాతం గ్రామీణులను ఇముడ్చుకున్న వ్యవసాయ వృత్తి రూపాంతరం చెందిందని చెప్పుకోవచ్చు. ముఖ్యమైన అంశం ఈ వృత్తిని వదిలేసిన గ్రామీణులు అధికమవుతూ రావడం. ఫలితంగా 2000 సంవత్సరం నాటికి 55–60 శాతం మంది, 2020 నాటికి 45–50 శాతం మాత్రమే వ్యవసాయాన్ని తమ మూల వృత్తిగా భావించే స్థితి నెలకొన్నది. దానికి ముఖ్య కారణం మిగిలిన గ్రామీణ వృత్తుల్లానే వ్యవసాయం వ్యాపారానికి తగినట్లుగా పరిణితి చెందకపోవడం. అంటే ఉత్పత్తికీ వినియోగానికి మధ్య రూపొందిన మార్కెట్ వ్యవస్థ పాత్ర పెరుగుతూ రావడం. దానికితోడు వృత్తి పరంగా సుస్థిరత, భద్రత లోపించడం. అంతేగాక శారీరక శ్రమ నుండి దూరంగా జరిగే తాత్వికతతో రూపొందించిన "విద్యా రంగ" విస్తరణ. ఫలితంగా వ్యవసాయ వృత్తి పూర్తిగా వ్యాపార స్వరూపాన్ని సంతరించుకొన్నది. దానికి ప్రత్యక్ష నిదర్శనమే...కేవలం శ్రమ జీవితానికే నెట్టబడ్డ గ్రామీణ కుటుంబాల వారు కౌలు రైతులుగా మారడం. భూ స్వంతదారులకు, శ్రమతోనే బతుకుతున్న గ్రామీణులకు మధ్య రూపొందిన ఘర్షణ పూరిత జీవన సరళి. ఈ వొరవడికి పరోక్షంగా పరిశోధనా రంగ నిపుణులు, విస్తరణ రంగ అధికారులు తోడ్పడ్డారు. కూలీలు (శ్రమజీవులు) అవసరంలేని సాంకేతికాలను రూపొందించడం, విస్తరించడం ముఖ్య కర్తవ్యంగా భావించారు. పంటల సాగుతో అనుబంధంగా నడిచే పశువుల, పక్షుల, ఇతర జీవుల పెంపకాన్ని విడివిడిగా నడిపే సాంకేతికాలను ప్రవేశపెట్టగలిగారు. ఈ స్థితి ప్రత్యక్షంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కనపడుతున్నది. డెయిరీలు, పౌల్ట్రీలు, చేపల చెరువులు పంట సాగుదార్లకు నష్టకరంగా మారాయి. ఈ దశలోనే "వ్యవసాయ వ్యాపకం" అనేది రూపొందింది. దాన్ని ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, మిద్దె పంటల సాగు, (ఆటవిక) వ్యవసాయ సాగుగా చెప్తున్నారు. ఇతర వృత్తుల ద్వారా భద్రతగల జీవితాలను నడపగలుగుతున్న మధ్య తరగతి పౌరులు, నగరాల్లో సొంత గృహ వసతి, మైదానాల వనరులుగల గృహిణులు ఈ భద్రతగల వ్యాపకంలోకి ప్రవేశించడాన్ని చూస్తున్నాం. అలాగే పెద్ద ఉద్యోగులుగా ముఖ్యంగా ఐ.టి రంగంలో ఇతర దేశాల్లో పనిచేసిన ప్రముఖులు కూడా ఈ వ్యాపకంలో ప్రవేశించి ఈ వ్యాపకాన్ని విస్తరించడాన్ని చూస్తున్నాం. ఈ తరహా వ్యవసాయ వ్యాపకానికి ప్రేరణ అనేకమంది పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు, ప్రఖ్యాత విశ్లేషకులు, ప్రపంచ స్థాయి ప్రకృతి వనరుల అధ్యయన సంస్థలు. సమాంతరంగా వివిధ నేపథ్యాల్లో రూపొందిన రసాయనేతర ఉపకరణాల ప్రాతను పెంచగల నిపుణుల తోడ్పాటు ఈ వ్యాపకాన్ని విస్తరింపచేస్తున్నది. రానురాను ఇది వ్యాపార రూపాన్ని సంతరించుకోవడాన్ని చూస్తున్నాం. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ రూపొందింది. ఫలితంగా ఈ వ్యాపకాన్ని లాభకర వృత్తిగా మార్చుకున్న "రైతులు కాని రైతులు"ను చూస్తున్నాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీన్నొక ఉద్యమంగా ప్రస్తుత సంక్షోభ పరిష్కార మార్గంగా రైతుల ముందుకు దీన్ని (ప్రకృతి పంట సేద్యం) తెస్తున్నారు. ఈ సంవత్సర కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు కూడా దీన్నే సూచిస్తున్నాయి. అంటే ఈ "వ్యాపక వ్యవసాయాన్ని" సన్న, చిన్నకారు రైతు, కూలీలకు 'వృత్తి' కల్పించిన కౌలు వ్యవసాయంలోకి ప్రవేశపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. పెట్టుబడి, పంట భద్రత, ప్రత్యామ్నాయ వనరులు, మార్కెట్ సౌకర్యాలకు దూరంగా నెట్టివేయబడిన ఈ రైతులు...ఈ వ్యాపకం లాంటి వ్యాపారంలో నిలబడగలరా? వినియోగదారుణ్ణి రక్షించడానికి భూమి వంటి వనరులను పొదుపు చేయడానికి, ఈ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని నడపగలరా? నమ్ముకోగలరా?

గతంలో ఒక గ్రోత్ ఇంజిన్ల కలల వ్యాపారి బియ్యాన్ని, చేపలను, రొయ్యలను ఎగుమతి చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథకంలో పెట్టబోయాడు. ఇప్పుడు వీళ్ల విష అవశేషాల్లేని ఆహారాన్ని ఎగుమతి చేసి దేశాన్ని ఉద్ధరించబోతున్నారు. వీళ్లే సమాంతరంగా జన్యు మార్పు సాంకేతికాల ద్వారా రూపొందించిన ఆవాలకు, డ్రోన్ సాంకేతికాల ద్వారా నడిచే ఘాటు రసాయన మందులకు అనుమతులు ఇస్తూనే ఉన్నారు.

అందుకే వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడం ఈ పాలకుల వల్ల కాదు. వీరి బడ్జెట్లు, ప్రణాళికలు ఆహార ఉత్పత్తిదారుణ్ణి భక్షించడానికే. ఉపాధి హామీ, ఆహార భద్రతా హక్కు చట్టాలను అటకెక్కించడమే వీరి లక్ష్యం. ఇలాంటి పాలకులను మార్చడమే మన తక్షణ కర్తవ్యం.

/ వ్యాసకర్త: విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త, సెల్ : 9490098905 /

జనవాక్యం

విశ్వసనీయత ఎక్కడ?

అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు సంవత్సరాలు కావస్తున్నా కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తాజాగా గత డిసెంబర్ మాసంలో ముఖ్యమంత్రి గారు జనవరి మాసంలో నిర్మాణం పనులు మొదలవుతాయని చెప్పారు. అయినా ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. ఇలా ప్రతి విషయంలోనూ పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి. కాలు గడప దాటడం లేదన్నట్లుగా ఉంది? పరిశ్రమలు రావు. ఉన్న పరిశ్రమలు పలు కారణాలతో మూత పడుతున్నాయి.యువత ఉపాధి అవకాశాలు లేక నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు.

– జి.రామకృష్ణ, ఏలూరు జిల్లా.

ఇసుక ప్రహసనం!

రాష్ట్రంలో ఇసుక సరఫరాపై అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలకుల ఆర్భాట ప్రచారం శృతి మించిపోయింది. అంతా పారదర్శకం, అవకతవకల్లేవు! అందరికీ అందుబాటులో ఇసుక అంటూ వారం వారం చిట్‌ఫండ్ కంపెనీ లెక్కన ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే, గత ఆరు నెలలుగా ఇసుక అమ్మకం డబ్బు ప్రభుత్వ ఖజానాకు చేరని వైనం పత్రికల్లో వచ్చింది. దీనిపై పాలకుల్లో ఉలుకూ పలుకూ లేదు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా నదీ గర్భాల నుంచి అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పాలక పార్టీలోనే ఈ అక్రమ దందాల్లో కొట్లాటలు వెలుగు చూస్తున్నాయి. బడాయి కబుర్లు చెప్పిన పెద్దలు ప్రస్తుత దుస్థితిపై పెదవి విప్పాలి!

– ఆర్.జి

కవిత్వం

ఏకరువాక్షరాలు

అక్షరాలన్నీ ఏకమై
వాక్య నినాదపు సమిత్తై
భావ వ్యక్తీకరణ సమ్మెతో
వీధుల్ని నిర్బంధిస్తున్నాయి
ఎన్నాళ్ళని ఎన్నేళ్ళని
ప్రజ్వలిస్తూ గర్జిస్తూ
వాక్యాలను ఈటెలుగా చేసి
సమస్యపై సంధిస్తూ
సమరంతో ఏకీభవిస్తున్నాయి
ఏకరువాక్షరాలన్నీ
పేరాలుగా విస్తరించుకుపోతూ
వ్యవస్థ మనుగడ
ప్రశ్నార్థకంగా కూర్చుని వుంటే
ప్రస్తుత తీరుపై
యుద్ధాన్ని ప్రకటిస్తున్నాయి
నోళ్ల తెరిచి అడిగినా
మనసు విప్పి అర్థించినా
కరగని తీరుతెన్నులపై
కవనాలుగా మారి కథావస్తువులా చేరి
వ్యాసాలుగా తిరగబడుతున్నాయి
నింగినంటుతున్న ధరలపైనా
అగాథంలో పడి విలపిస్తున్న
సగటు జీవన సరళి పైన
కలాలన్నీ ఏకమై కాగితాల రెపరెపలతో
నిరసన ప్రకటిస్తున్నాయి
ఇంకెన్నాళ్ళని ఎన్నేళ్ళని.
మొద్దుబారిన మస్తిష్కాలపై
అక్షర సమరం చేయాలి
ఇప్పుడు కవితలన్నీ కంకణం కట్టుకుని
బతుకు కోతలపై
రాతలుగా తిరగబడుతున్నాయి
వ్యథల జీవన వ్యవస్థపై
నవలా చైతన్యపు పేరాలుగా
కరువు అరువుని
ఎత్తిచూపే కథా సంపుటాలుగా
సమాజంపై పరుచుకుపోవాలి
ఏకరువాక్షరాలన్నీ ఏకమై
సామాజిక నాడి లోపల
చైతన్యం నిండిన ఎర్రని ఇంకువలే
బొట్లు బొట్లుగా రాలి
అక్షరాలుగా రూపాంతరం చెందాలి
నేటి స్థితి గతులపై అక్షర శ్రామిక లోకం
నిరంతరం శ్రమిస్తూ కదలాలి
కలం బలం చాటాలి.


– నరెద్దుల రాజారెడ్డి, సెల్ : 9666016636

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

కామెంట్

సత్య

'మనవాళ్లు వట్టి వెధవాయి లోయి...'!



'మనవాళ్లు వట్టి వెధవాయి లోయి...' అన్నాడు గురజాడ గిరీశం. అంటే నిష్ప్రయోజకులు అని అర్థం. శాస్త్రంలో ఉన్న ప్రతిదానికీ మినహాయింపులుంటాయని మన పండితులెప్పుడో సెలవిచ్చారు గనుక గిరీశం చెప్పినదానికి మినహాయింపు ఏమిటంటే అది అందరికీ వర్తించదు. వాట్సాప్ "విజ్ఞానాన్ని" గుడ్డిగా నమ్మే అజ్ఞానులకు మాత్రమే అని చెప్పవచ్చు. నరేంద్ర మోడీ మీద విదేశీ బిబిసి చెప్పిందాన్ని మనం నమ్మాలా, దాన్ని ప్రామాణికంగా తీసుకోవాలా, దేశభక్తుడు అదానీ కంపెనీల గురించి అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ అనే సంస్థ ఇచ్చిన నివేదికను విశ్వసించాలా అని 56 అంగుళాల ఛాతీ విరుచుకొని ప్రశ్నిస్తున్నవారు మనకు చాలా మంది కనిపిస్తారు. నిజమే దేన్నీ గుడ్డిగా నమ్మకూడదు. వాళ్లే ఇంకా ఏమంటారంటే మన దేశంలో నరేంద్రమోడీని విమర్శించే దేశద్రోహులకు మోడీ గురించి విదేశాల వారు చెప్పే ప్రశంసలు కనిపించవా అని తర్కానికి దిగుతారు.

అదే విదేశీయులు విమర్శిస్తే, దాని సంగతేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే శత్రువులను భుజాన వేసుకుంటారా అని మాటలమారులు దెబ్బలాడతారు. వారి నాలికలకు నరం ఉండదు. ఇదే గ్యాంగు వాట్సాప్‌లలో తిప్పుతున్న ఒక అంశాన్ని చాలా మంది చదివే ఉంటారు. అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ పత్రిక చీఫ్ ఎడిటర్ జోసెఫ్ హోప్ రాసిన సంపాదకీయం అంటూ నరేంద్ర మోడీ గొప్పతనం గురించి అనేక అంశాలను పేర్కొన్నారు. బిబిసి విమర్శిస్తే దురుద్దేశం ఉంది అన్నారు. మరి ఈ సంపాదకీయం మోడీని బుట్టలో వేసుకొనేందుకు మునగ చెట్టు ఎక్కించినట్లా? ఇక జోసెఫ్ సంపాదకీయంలో చెప్పిందేమిటో కొన్ని ఆణిముత్యాలను చూద్దాం. లేకపోతే మోడీ భక్తుల మనోభావాలు గాయపడితే ప్రమాదం.

"నరేంద్ర మోడీ ఒక ప్రత్యేక లక్ష్యం వైపుగా పయనిస్తున్నారు. ఆయన ఏం చెయ్యబోతున్నారో ఎవ్వరికీ తెలియదు (నిజమే పెద్ద నోట్ల రద్దు అనే పిచ్చిపని తెలిసిందే). ఆయన చిరునవ్వు వెనుక ఒక భయంకరమైన దేశభక్తుడున్నాడు (ఇదేమీ వర్ణనరా బాబూ, ఏ దేశభక్తుడినైనా ఇలా వర్ణించటం చూశారా, అసలు నరేంద్ర మోడీలో ఎవరైనా చిరునవ్వును చూశారా). పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లకు అమెరికాతో సంబంధాలను తెగ్గొట్టారు. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో పాకిస్తాన్ సరిహద్దులకు దగ్గరగా మిలిటరీ స్థావరాన్ని ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ను నాలుగు ముక్కలు చేస్తారు. యుద్ధం చేయకుండానే పాకిస్తాన్ను సర్వనాశనం చేశారు. ఆసియా ఖండంలో ఆధిపత్యాన్ని నిరూపించాడు. రష్యా, జపాన్‌లను అతి సున్నితంగా తన గుప్పిట్లో ఉంచుకున్నాడు." ఇలాంటి అనేక అంశాలను చెప్పి ఇంతవరకు ఎవ్వరినీ నేను ఇంతగా మెచ్చుకోలేదు అని జోసెఫ్ హోప్ రాసినట్లుగా దానిలో పేర్కొన్నారు. ఇంతకీ అసలు సంగతి ఏమంటే బిబిసి, హిండెన్‌బర్గ్ వాస్తవం. జోసెఫ్ హోప్ అనే జీవి అసలు ఉనికిలో లేడు, న్యూయార్క్ టైమ్స్ పత్రిక అసలు అలాంటి సంపాదకీయం రాయలేదు. ఇది ఫేక్ న్యూస్ అని అనేక సంస్థలు దాని బండారాన్ని చెప్పాయి. పోనీ ఇది వాస్తవం కాదని ప్రభుత్వం ప్రకటించిందా అంటే అదెక్కడా కనపడదు. నమో భారతీయం వంటి పేర్లతో ఆంగ్లంలో ప్రచారం చేసినదానిని తెలుగులో పాక్షికంగా అనువదించి వాట్సాప్‌లో తిప్పుతున్నారు.

వారం రోజుల తరువాత స్వదేశీ జాగరణ మంచ్ అనే ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ మేలుకున్నది. గౌతమ్ అదానీకి వత్తాసు పలుకుతూ హిండెన్‌బర్గ్ సంస్థకు చైనాకు లంకె ఉందని సంస్థ సహ కన్వీనర్ అశ్వనీ మహాజన్ ప్రకటించారు. అదానీకి తమ మద్దతు ఉంటుందని, అలాంటి నివేదికలు మిమ్మల్నేమీ చేయవంటూ ధైర్యం చెప్పారు. మరొక వాట్సాప్ పోస్టులో అదానీ దేశభక్తి గురించి సెలవిచ్చారు. ఇజ్రాయిల్ హైఫా రేవును అదానీ తీసుకున్నందుకు చైనాకు కోపం వచ్చి హిండెన్‌బర్గ్‌తో నివేదిక ఇప్పించిందట. ఇజ్రాయిల్ మొదటి నుంచీ అమెరికా తొత్తు, చైనాకు ఎప్పుడూ శత్రు దేశమే. దాని రేవును చైనా మీద గూఢచర్యానికి వినియోగిస్తే అదే పని అమెరికా చేయలేదా, దాన్ని అదానీకి అప్పగించాలా! మోకాలికీ బోడిగుండుకు ముడిపెట్టటం అంటే ఇదే. హిండెన్‌బర్గ్ నిర్వాహకుడు అమెరికాలో స్థిరపడిన ఇజ్రాయెలీ. ప్రపంచంలో కంపెనీల వాటాలను షార్ట్ సెల్లింగ్ చేసే సంస్థ హిండెన్‌బర్గ్ ఒక్కటే కాదు. దానికి నిధులు ఇవ్వటం ఎందుకు? స్వయంగా చైనా అలాంటి కంపెనీని పెట్టవచ్చు. ప్రపంచంలో డాలర్ నిల్వలు ఎక్కువ ఉన్న దేశం అది. ఒక్క అదానీని మాత్రమే ఎందుకు...అన్ని పారిశ్రామిక సంస్థలను అదే విధంగా చేయవచ్చు కదా? చైనా గనుక హిండెన్‌బర్గ్‌కు నిధులు ఇస్తే మన జేమ్స్ బాండ్ అజిత్ దోవల్‌ను పంపి బయట పెట్టించవచ్చు. ఎవరన్నా అడ్డుపడ్డారా? కాసేపు నిజంగానే చైనా నిధులు ఇచ్చి ఆ పని చేసిందని అనుకుందాం. పార్లమెంటును కుదిపివేస్తున్న ఈ ఉదంతం మీద మాట్లాడి దాని బండారాన్ని వెల్లడించవచ్చు. ఇదేమీ దేశ రహస్యం కాదు. ఎందుకు మౌనంగా ఉన్నట్లు ? ఆడలేక మద్దెల ఓడంటే కుదరదు.

హిండెన్‌బర్గ్ నివేదికను ఆసరా చేసుకొని చైనా మీద ప్రచారదాడి మొదలు పెట్టటం వెనుక అసలు అంశాన్ని పక్కదారి పట్టించి అదానీ కంపెనీలను రక్షించే ఎత్తుగడ ఉంది. హిండెన్‌బర్గ్ తన నివేదికలో అదానీకి చాంగ్ చుంగ్ లింగ్ అనే చైనా జాతీయుడికి ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించింది. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఇంటి చిరునామానే తనదిగా చాంగ్ ఇచ్చాడని, అతనితో ఉన్న సంబంధం గురించి చెప్పాలని నిగ్గదీసింది. ప్రపంచంలో ఉన్న చైనా జాతీయులందరూ చైనా పౌరులు కానట్లే ఇతగాడూ కాదు. తైవాన్‌కు చెందినవాడు. హిండెన్‌బర్గ్ 129 పేజీల నివేదికలో లేవనెత్తిన ప్రశ్నలకుగాను అదానీ ఇచ్చిన 413 పేజీల వివరణలో కీలకమైన వాటిని విస్మరించారు. చాంగ్ గురించి హిండెన్‌బర్గ్ నివేదికలో నాలుగు చోట్ల ప్రస్తావన ఉంది. ఒక్కదానికీ అదానీ సమాధానం ఇవ్వలేదు. నిజానికి ఎలాంటి అక్రమాలకు పాల్పడకపోతే అంతా ఉత్తిదే అని ఒక ట్వీట్ చేసి ఊరుకునేదానికి అంత వివరణ ఎందుకు ఇవ్వాలి.

హిండెన్‌బర్గ్ నివేదికలో "గుడామీ ఇంటర్నేషనల్" అనే సంస్థ గురించి పేర్కొన్నారు. దానిలో చాంగ్ డైరెక్టర్‌గా పనిచేశాడు. అది తమకు సంబంధించినదే అని అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2002 కంపెనీ వివరాల్లో పేర్కొన్నది. ఈ గుడామీ ఇంటర్నేషనల్ 2018 వార్తల్లో ఉంది. కాంగ్రెస్ నేతలు, మిలిటరీ అధికారులు ముడుపులు పుచ్చుకున్నారన్న ఆరోపణలు వచ్చిన అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ కుంభకోణంలో అనుమానిత మూడు సింగపూర్ సంస్థలలో ఇదొకటి. మాంటెరోసా ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ అనే సంస్థ అదానీ కంపెనీల్లో 450 కోట్ల డాలర్ల మేరకు పెట్టుబడులు పెట్టింది. ఈ కంపెనీలో గుడామీ పెట్టుబడులు పెట్టింది. చాంగ్ అనేక అదానీ కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నట్లు హిండెన్‌బర్గ్ పేర్కొంటే మన దేశానికి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) ఇచ్చిన ఒక తీర్పు ఉత్తరువులో, సంస్థ రికార్డుల్లో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఇంటి చిరునామానే తన అడ్రస్‌గా చాంగ్ ఇచ్చినట్లు ఉంది.


ఇదిగాక హిండెన్‌బర్గ్ మరొక ఉదంతాన్ని పేర్కొన్నది. గ్రోమోర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీ 2011లో 42.3 కోట్ల డాలర్ల లాభంతో అదానీ పవర్‌లో విలీనమైంది. దీనికీ చుంగ్‌కు సంబంధం ఉంది. భారత చట్టాల ప్రకారమే దాన్ని విలీనం చేసుకున్నాం తప్ప అక్రమాలేమీ జరగలేదని అదానీ తన సమాధానంలో పేర్కొన్నది.హిండెన్‌బర్గ్ లేవనెత్తిన 88 ప్రశ్నల్లో మూడు పిఎంసి ప్రాజెక్ట్స్ అనే సంస్థకు చెందినవి. దీనికి అదానీ కంపెనీలు చెల్లింపులు జరిపినట్లు డిఆర్ఐ నివేదికలను ఉటంకిస్తూ పేర్కొన్నారు. ఈ కంపెనీ అదానీ బినామీనా కాదా చెప్పాలని కోరింది. ఇది చాంగ్ చుంగ్ లింగ్ కుమారుడిదని, తైవాన్‌లో అదానీ కంపెనీ ప్రతినిధి అని పేర్కొంటూ వారంతా కలసి ఉన్న చిత్రాన్ని కూడా జత చేసి వారి సంబంధాలపై అనుమానాలున్నట్లు పేర్కొన్నది. పిఎంసితో తమకెలాంటి సంబంధాలు లేవని అదానీ తన వివరణలో పేర్కొన్నారు. తాము అడిగిన దానికి సూటిగా చెప్పకుండా కలగాపులగం చేసి చెప్పారని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది.

ప్రస్తుత ప్రపంచ రాజకీయ చదరంగంలో అమెరికాకు మన అవసరం ఉంది తప్ప మనకు దాని అవసరం లేదని, మన ప్రధాని మోడీ చక్రం తిప్పుతున్నట్లు ఒకవైపు ప్రచారం. అమెరికా మనకు జిగినీ దోస్తుగా ఉంది, మన ప్రధాని మోడీ దాని అధ్యక్షులతో భుజాల మీద చేతులు వేసి తిరిగే చనువు ఉంది. నిజంగా దానికి మన అవసరం ఉంటే హిండెన్‌బర్గ్ గురించి ఇంతవరకు జో బైడెన్ నోరు విప్పడేం. మదుపర్ల సంపద లక్షల కోట్లు ఆవిరవుతుంటే నరేంద్రమోడీ ఫోన్ చేసి మాట్లాడరేం! హిండెన్‌బర్గ్ వెనుక చైనా ఉందని మన వాట్సాప్ మరుగుజ్జులకు తెలిసిన పరమ రహస్యం మోడీ సర్కార్‌కు తెలియని దుస్థితిలో ఉందా? తెలిస్తే హెచ్చరిక ఎందుకు చేయరు? దేశం, మదుపర్ల కంటే మౌనమే ప్రధానమా? ఇంతటి సంచలనం చెలరేగితే ఏ దేశాధినేతైనా మౌనంగా ఉంటారా? జనాలకు భరోసా ఇవ్వాల్సిన రాజధర్మం తెలియదా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలేమిటి అని ఆలోచించకుండా వాట్సాప్, ఫేస్‌బుక్కులో మోడీ, అదానీ, తదితరుల గురించి ప్రచారం చేసే అతిశయోక్తుల మీద స్వంత బుర్రలను ఉపయోగించకుండా వాటిని ఇతరులకు పంచే, ప్రచారం చేసే, సమర్థించే పెద్దమనుషులను గిరీశం చెప్పినట్లుగా వర్ణిస్తే తప్పా!

★

ఆగని 'అదానీ' ప్రకంపనలు

ఉభయ సభల్లో లేవనెత్తిన ప్రతిపక్షాలు



ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ తీరుకు లోక్‌సభ నుంచి వాకౌట్ చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష, బిఆర్‌ఎస్ ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో 'అదానీ' ప్రకంపనలు బుధవారం కూడా కొనసాగాయి. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక చేసిన ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అదానీ గ్రూప్ షేర్ల విలువ పతనమవడం అతి పెద్ద కుంభకోణమని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని ఎల్‌ఐసి, ఎస్‌బిఐ ఈ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టినందువల్ల ఇది సామాన్యుల సొమ్ముకు సంబంధించిన విషయమని పేర్కొన్నాయి. అదానీ గ్రూప్‌పై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన థాకరే వర్గం, బిఆర్‌ఎస్ వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. రూల్ 267 ప్రకారం కె కేశవరావు (బిఆర్‌ఎస్), సంజయ్ సింగ్ (ఆప్), శివసేన (ఠాక్రే) ఎంపిలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది ఇచ్చిన నోటీసులను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ అనుమతించలేదు. దీంతో ఆయా పార్టీల సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభలో ఎక్కువ సమయం గడపాలని హితవు పలికారు. ఆయన మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన మంత్రులు, ఎంపిలు హిందూ-ముస్లిం అంటూ మాట్లాడుతున్నారన్నారు. మాట్లాడటానికి ఇతర అంశాలేవీ వారికి దొరకలేదా? అని నిలదీశారు. ఆలయాల్లోకి ప్రవేశించే ఎస్‌సిలను కొడుతున్నారన్నారు. వారిని హిందువులుగా పరిగణిస్తే, ఆలయాల్లోకి ఎందుకు ప్రవేశించనివ్వడం లేదని ప్రశ్నించారు. వారు చదువుకోవడానికి అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు. ఎస్‌సిల ఇళ్లలో భోజనం చేస్తున్నట్లు కనిపించే ఫొటోలను చాలా మంది మంత్రులు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినదానినే రాష్ట్రపతి, గవర్నర్లు పునరుద్ఘాటించడం తరచూ జరుగుతోందన్నారు. అయితే ఈసారి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మైనారిటీల గురించి మాట్లాడతారని తాను ఆశించానని, కానీ తనకు నిరాశే మిగిలిందని అన్నారు. నిజం మాట్లాడితే తాను జాతి వ్యతిరేకిని అవుతానా? అని నిలదీశారు. 'నేను దేశ వ్యతిరేకిని కాను. ఇక్కడ ఉన్నవారిలో ఎవరితో పోల్చుకున్నా నేను గొప్ప దేశభక్తుడిని. నేను భూమి పుత్రుడిని. మీరు దేశాన్ని దోచుకుంటున్నారు. నన్ను దేశ వ్యతిరేకి అంటున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై పదే పదే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారని అన్నారు. జగ్‌దీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ.. దేశానికి మనం చెడు సందేశాన్ని పంపిస్తున్నామన్నారు. వ్యూహాత్మకంగానే ఈ విధంగా చేస్తున్నారన్నారు. రాజ్యసభ ప్రారంభం కాగానే అదానీ గ్రూప్ అంశాన్ని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తడంతో గందరగోళం ఏర్పడింది.

రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ నోటీస్

లోక్‌సభలో రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రివిలేజ్ మోషన్‌ను ప్రతిపాదించారు. పార్లమెంటు నిబంధనల ప్రకారం ఓ ఎంపి ముందుగా నోటీసు ఇవ్వకుండా ఎటువంటి ఆరోపణలు చేయరాదన్నారు. ఓ కాంగ్రెస్ నేత (రాహుల్ గాంధీ) మంగళవారం నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. బిజెపి ఎంపి నిషికాంత్ దుబే కూడా రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ మోషన్‌ను ప్రతిపాదించారు. సభలో లేని వ్యక్తిపై ఆరోపణలు చేయరాదన్నారు.

జాతీయ జెండాలో ఆకుపచ్చ రంగు తొలగిస్తుందా?

హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ త్రివర్ణ పతాకం నుంచి ఆకుపచ్చ రంగును మోడీ ప్రభుత్వం తొలగిస్తుందా? అని ప్రశ్నించారు. ఆకుపచ్చ రంగుతో మోడీ ప్రభుత్వానికి అన్ని సమస్యలు ఎందుకని ప్రశ్నించారు.

బిల్కిస్ బానో కేసులో దోషుల విచారణకు బెంచ్

- సుప్రీంకోర్టు హామీ

న్యూఢిల్లీ : గుజరాత్ మత ఘర్షణల్లో బాధితురాలు బిల్కిస్ బానో కేసులో దోషులను విడుదల చేయడంపై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గుజరాత్ మత ఘర్షణల సమయంలో బిల్కిస్ బానో కుటుంబ సభ్యులను హత్య చేయడమే కాకుండా, ఆమెపైనా అఘాయిత్యానికి పాల్పడిన దుండగులు దోషులుగా నిర్ధారణై యావజ్జీవ శిక్ష పడిన 11 మందిని బిజెపి ప్రభుత్వం శిక్ష పూర్తికాకుండానే క్షమాభిక్ష పేరుతో విడుదల చేసిన సంగతి తెలిసిందే. వీరిని విడుదల చేయడాన్ని సవాలు చేసిన బిల్కిస్ బానోకు సుప్రీం కోర్టు హామీ ఇచ్చింది. దోషుల విడుదలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు కొత్త బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపింది. సాధ్యమైనంత త్వరలో కొత్త బెంచ్ ఏర్పాటవుతుందని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పర్దివాలాలతో కూడిన బెంచ్ తెలిపింది.

14న 'పశు కౌగిలి' దినం

- కేంద్ర పశు సంవర్ధక శాఖ ప్రకటన

న్యూఢిల్లీ : వైవిధ్యభరితమైన భారత సంస్కృతి, సంప్రదాయాలను కేంద్రీకరించి, హిందుత్వ వైపు లాక్కెళ్తున్న బిజెపి ప్రతిదానికి పక్షపాత పద్ధతిలో ఎత్తుగడలు వేస్తోంది. వీధులకు పేర్లు మార్చడం, మసీదులు, క్రైస్తవ మందిరాల కింద హిందూ ఆలయాలున్నాయంటూ రభస చేయడం చూశాం..ఇప్పుడు భిన్న సంస్కృతులను ప్రతిబింబించే దినోత్సవాలను కూడా హైందవీకరించే పన్నాగం చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రేమికులు దినోత్సవం జరుపుకునే ఫిబ్రవరి 14ను 'పశు కౌగిలి' (కౌ హగ్) దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి ఎస్ కుమార్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు.



దుమ్ము, ధూళి ఎగిసిపడుతుండటంపై నిలదీస్తున్న స్థానికులు

విశాఖలో చకచకా పనులు

- రాజధాని తరలింపులో భాగమేనా?
- పిఎం పాలెంలో పోలీస్ బెటాలియన్ స్థలం చదును

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో పలు పనులను అధికార యంత్రాంగం చకచకా నిర్వహిస్తోంది. రాజధాని ఏర్పాట్లలో భాగంగా ఇవి జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. విశాఖలోని పిఎం పాలెం ఆర్టీసి బస్టాప్ వద్ద పోలీస్ శాఖకు వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరు చేసిన సుమారు 54 ఎకరాల స్థలాన్ని తాజాగా బుధవారం చదును చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. కొత్త సర్వే నెంబరు 92 నుంచి 100 వరకూ 54 ఎకరాల పైబడిన స్థలంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు జరుగుతున్నాయి. ఈ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ స్థలాన్ని చదును చేసేందుకు విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణకు సంబంధించిన స్థలంలో నుంచి గ్రావెల్ సరఫరా చేస్తున్నారు. దీంతో, దుమ్ము, ధూళి ఎగిసిపడుతుండడంతో స్థానికులు బుధవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది పోలీసులకు సంబంధించినదని సర్దిచెప్పి అధికారులు వారిని పంపించేశారు. ఎపిఎస్‌పి 16వ బెటాలియన్, సిఆర్‌పిఎఫ్ 2, 3, 4 బెటాలియన్స్ కూడా ఈ ప్రదేశంలోనే ఉన్నాయి. దీంతో, రాష్ట్ర పోలీస్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని దీన్ని పరిగణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చినట్టు పోలీసులు చెబుతున్నారు. రక్షణ దళాల తొలుత సిద్ధం చేసుకుంటే రాజధాని ఏర్పాట్లలో సగం పని పూర్తయిపోయినట్లేనంటూ జిల్లా అధికారులు అంటున్నారు.

తీరం వెంబడి పనులు...

సాగర తీరం వెంబడి పలు అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గడిచిన 15 రోజులుగా జిల్లా ఉన్నతాధికారుల నేతృత్వంలో మౌలిక వసతుల కల్పనకు ప్రయత్నాలు తీవ్రం చేశారు. ఆర్‌కెబీచ్ నుంచి భీమునిపట్నం వరకూ మరమ్మతులకు గురైన పలు రహదారుల నిర్మాణం, రోడ్లకిరువైపులా బారికేడ్ల పనులు చురుకుగా సాగుతున్నాయి. వచ్చే నెల 3, 4 తేదీల్లో ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు, ఆ తర్వాత 28 నుంచి 30 వరకూ జి-20 దేశాల ప్రతినిధుల సమ్మిట్ సాగర తీరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్నాయి. వీటన్నింటి నిర్వహణలో భాగంగా సాగర తీరం సుందరీకరణ పనులను సుమారు రూ.150 కోట్లతో జివిఎంసి చేపట్టింది. రాష్ట్ర రాజధానిగా విశాఖను వైసిపి ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. త్వరలో తాను విశాఖకు షిఫ్ట్ అవుతానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పనులను వేగవంతం చేయడంతో మార్చి తర్వాత ఏ క్షణంలోనైనా విశాఖకు ప్రభుత్వ శాఖలు వస్తాయనే ప్రచారం జరుగుతోంది

11,200కి పైనే భూకంప మృతులు !

- అహర్నిశలు శ్రమిస్తున్న సహాయక సిబ్బంది

ఇస్తాంబుల్ : టర్కీ, సిరియాలను కుదిపేసిన పెను భూకంపంలో మృతుల సంఖ్య బుధవారానికి 11,200కి పైగానే వుంది. మరోవైపు శిథిలాల కింద చిక్కుకుపోయిన వందలాది మందిని వెలికితీసేందుకు సహాయక సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. 48 గంటలు గడుస్తుండడంతో పరిస్థితి మరింత దిగజారే అవకాశాలు వున్నాయని భయపడుతున్నారు. టర్కీలో ఇప్పటివరకు 8,574 మంది చనిపోగా, సిరియాలో 2,662 మంది మరణించారని ఇరు దేశాల అధికారులు, వైద్య సిబ్బంది తెలిపారు. టర్కీలో దాదాపు 50 వేల మంది గాయపడగా, సిరియాలో మరో ఐదువేలమంది గాయపడ్డారు. తొలిసారి వచ్చిన భూకంప కేంద్రమైన కహ్రామన్మారస్ లో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పర్యటించారు. ఈ నగరంలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ శిథిలాల నుండి మూడేళ్ళ బాలుడు ఆరిఫ్ ఖాన్‌ను దాదాపు రెండు రోజుల తర్వాత సజీవంగా వెలికి తీశారు. కొద్ది గంటల తర్వాత అదియామన్ నగరంలో పదేళ్ళ బీటుల్ ఎడిస్‌ను ఇలాగే శిథిలాల నుండి కాపాడారు. ఈ రెండు సంఘటనలతో సహాయక కార్యకర్తల్లో ఇంకా ఆశలు సజీవంగా వున్నాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని కాపాడగలమనే ఆశ కలుగుతోంది. ఇదిలా వుండగా, భూకంపాలకు ధ్వంసమైన ప్రాంతాలను ఏడాదిలోగా పునర్నిర్మాస్తామని ఎర్డోగన్ హామీ ఇచ్చారు.

జపాన్‌లో 2011లో సునామీ రావడానికి కారణమైన భూకంపం కన్నా ఇది శక్తివంతమైన భూకంపం. టర్కీలో బాధితుల్లో చాలామంది తమ కారుల్లోనే నిద్ర పోతున్నారు. టెంట్ కానీ, హీటింగ్ స్టవ్‌కానీ లేదని, పిల్లలు కూడా ఇబ్బందులు పడుతున్నారని, దానికి తోడు వర్షంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని వారు వాపోతున్నారు. ఆకలితో లేదా ఈ భూకంపంలోనో తాము చనిపోవడం లేదని, ఎముకలు కొరికేస్తున్న చలితో పోయేలా వున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుధవారానికి దాదాపు 25 దేశాలకు చెందిన సహాయక బృందాలు టర్కీ చేరుకున్నాయి. అలాగే సహాయం కూడా వెల్లువెత్తుతోంది. సిరియాలో రెబెల్స్ అదుపులో వున్న ప్రాంతాలకు సహాయ సరఫరాలు అందేలా చూసేందుకు అన్ని మార్గాలు అన్వేషిస్తున్నామని ఐక్యరాజ్య సమితి తెలిపింది.

సిరియాలో శిథిలాల్లో నవజాత శిశువు !

వాయవ్య సిరియా పట్టణంలో శిథిలాల కింద ఇంకా బొడ్డూడని నవజాత శిశువుని అక్కడి ప్రజలు గుర్తించారు. భూకంపం వచ్చిన సమయంలో ప్రసవించిన తల్లి వెంటనే చనిపోయింది. ఇతర కుటుంబ సభ్యులు కూడా శిథిలాల కింద నలిగి చనిపోయారు. కానీ తల్లి నుండి బొడ్డు తాడు కూడా వేరుపడని ఆ చిన్నారి మాత్రం మట్టిలో కప్పబడి ఏడుస్తూ కనిపించడంతో అధికారులు వెంటనే రక్షించి, ఆస్పత్రిలో చేర్చారు. విపరీతమైన చలి కారణంగా ఆ పాప హైపోథెర్మియాకు గురైందని, వెంటనే శరీరాన్ని వెచ్చ బరిచి, తగిన చికిత్స చేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

సిబిఐకి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర సిఐడి ఆఫీసర్లు తనను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసిన ఘటనపై సిబిఐ లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తునకు ఆదేశించాలని నర్సాపురం ఎంపి కె రఘురామకృష్ణరాజు వేసిన కేసులో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సిబిఐను ఆదేశించింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ రవినాథ్ తిల్హరీ బుధవారం ప్రకటించారు.

పంచాయతీ నిధుల మళ్లింపుపై పిల్

కేంద్రం గ్రామ పంచాయతీలకు ఇచ్చిన రూ.7,659 కోట్ల నిధులను రాష్ట్రం ఇతర అవసరాలకు మళ్లించిందనే పిల్‌ను చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. నిధుల మళ్లింపుపై మహాత్మాగాంధీ ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, టిడిపి మాజీ ఎమ్మెల్సీ వైబి రాజేంద్రప్రసాద్ ఇతరులు వేసిన పిల్‌ను డివిజన్ బెంచ్ విచారణ జరిపింది.

కాశ్మీర్‌లోనూ బుల్డోజర్ ఆగడాలు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్, న్యూఢిల్లీలో చేపట్టిన తరహాలోనే జమ్ముకాశ్మీర్‌లోనూ బిజెపి పాలకుల బుల్డోజర్ ఆగడాలు కొనసాగాయి. బిజెపి అధికారాన్ని అడ్డం పెట్టుకుని కాశ్మీర్ ప్రజల ఇళ్లను అన్యాయంగా కూల్చివేస్తోంది. కూల్చివేతల డ్రైవ్‌కి వ్యతిరేకంగా పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) తదితర పార్టీలు బుధవారం నిరసన చేపట్టాయి. ఈ నేపథ్యంలో నిరసనల్లో పాల్గొన్న జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా సహా పలువురిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీ పోలీసుల నిర్బంధంలోనే ఉన్నారు. పోలీసుల చర్యను జమ్మూకాశ్మీర్‌లోని రాజకీయ నేతలు ఖండించారు. కూల్చివేత డ్రైవ్‌పై మెహబూబా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'బిజెపి తన మెజారిటీని ఆయుధాల కోసమో లేక రాజ్యాంగంతో సహా బుల్డోజ్ చేయడానికో ఉపయోగిస్తున్నది. ప్రజల ఇళ్లను కూల్చివేయడం వల్ల ప్రయోజనం ఏమిటి?' అని ఆమె అన్నారు. ఇతర రాజకీయ పార్టీలు నేతలు కూడా ఇళ్ల కూల్చివేతలను విమర్శించారు. వారంతా బిజెపి 'కాశ్మీర్ ప్రజలపై' కూల్చివేతల దాడి చేస్తోందని అన్నారు. అసలు ప్రజల ఇళ్లను ఎందుకు కూల్చివేస్తున్నారో స్పష్టతనివ్వాలని, శ్వేతపత్రం విడుదల చేయాలని రాజకీయ పార్టీలు బిజెపిని డిమాండ్ చేశాయి.

ఎమ్మెల్యేలకు ఎర కేసుపై 17న విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టేటస్ కో ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సిబిఐకి అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. బుధవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లుత్రా అంశాన్ని లేవనెత్తారు. సిబిఐ చేతికి సాక్షులు వెళ్తే చేసేది ఏమీ లేదని సిద్ధార్థ లూత్రా అన్నారు. మెరిట్స్ ఉంటే హై కోర్టు తీర్పును రివర్స్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. స్టేటస్ కో ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. త్వరితగతిన విచారించడానికి నిరాకరించిన ధర్మాసనం, 17న విచారణ జరిపేందుకు అంగీకరించింది.

వేలాది చిన్న పరిశ్రమల మూత

న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇఎస్)లకు ఈ ఏడాది కష్టతరమైన సంవత్సరమని కేంద్రం పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 10,655 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇఎస్)లు మూతపడ్డాయని, గడిచిన నాలుగేళ్లలో ఇది అత్యధికమని పేర్కొంది. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రం ఈ డేటాను వెల్లడించింది. 2021-22లో ఈ సంఖ్య 6,222 పరిశ్రమలు మూతపడగా, 2020-21లో 175 పరిశ్రమలు, 2019-20లో 400 పరిశ్రమలు మూతపడినట్లు తెలిపింది.

- బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 9న జరపాలని లేబర్, ఫ్యాక్టరీస్ అండ్ ఐఎంఎస్ డిపార్టుమెంట్ పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 1ని బుధవారం విడుదల చేసింది.

బిజెపితో పవిత్ర బంధంతోనే అదానీ ఎదుగుదల

- లోక్‌సభలో సిపిఎం ఎంపి ఆరిఫ్



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపి ఆరిఫ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపితో పవిత్ర బంధంతోనే అదానీ ఎదిగారని సిపిఎం ఎంపి ఆరిఫ్ పేర్కొన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో సిపిఎం తరపున ఆరిఫ్ మాట్లాడారు. 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను. దేశంలోని సామాన్య ప్రజల మనోభావాలను పూర్తిగా విస్మరిస్తూ లోక్‌సభ, ఇతర రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల కోసం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ఒక అవకాశంగా రాష్ట్రపతి ప్రసంగం చేశారు. రాజ్యాంగం ప్రకారం అనుమతి లేని కారణంగా రాష్ట్రపతి తన ఎన్నికల ప్రచారాన్ని పార్లమెంటు సెంట్రల్ హాల్ నుండి ప్రారంభించారు. రొటేషన్ ప్రాతిపదికన భారతదేశానికి అప్పగించబడిన జి-20 నాయకత్వ పాత్రను బిజెపి ప్రభుత్వం సాధించిన విజయం ఎలా అవుతుంది?. నిజమే, బిజెపి తప్ప మరే ఇతర పార్టీ కూడా దీన్ని తన రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేందుకు ప్రయత్నించలేదు. జి-20 లోగోలో బిజెపి జెండా రంగులు, ఆ పార్టీ గుర్తు కమలం పేర్కొనడంతో ప్రపంచం ముందు భారతదేశాన్ని అపహాస్యం చేసింది' అని విమర్శించారు.

'ఈ ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన బిజెపి ఎంపి చంద్రప్రకాష్ జోషి 2022లో 121 దేశాల్లో పేదరిక సూచీలో భారతదేశం 107వ స్థానంలో ఉందని రాష్ట్రపతికి తెలియజేయాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వ సొంత ఆర్థిక సర్వే, రిజర్వ్ బ్యాంక్, ఆక్స్‌ఫామ్ వంటి ఏజెన్సీల నివేదికల ప్రకారం, భారతదేశంలో దాదాపు 26 కోట్ల మంది పేదలు నివసిస్తున్నారు. ఈ ప్రభుత్వం 2047 సుదీర్ఘ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 26 కోట్ల పేదల ప్రజల ఆశలకు ద్రోహం చేసింది. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడానికి, వీక్షించడానికి 2047 వరకు వారిలో ఎంత మంది జీవించి ఉంటారో అని వారు ఆశ్చర్యపోతారు. కోవిడ్-19 వ్యాక్సిన్‌ను ఉచితంగా 45 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే పరిమితం చేసింది. సుప్రీం కోర్టు జోక్యం కారణంగా, ఇది 18 ఏళ్లు పైబడిన పౌరులందరికీ ఉచితంగా అందించబడింది. అప్పుడు కూడా సుప్రీం కోర్టు చిత్రపటానికి బదులు, వ్యాక్సిన్ సర్టిఫికెట్లన్నింటికీ ప్రధాని నవ్వే ముఖం ఉంది. ప్రపంచంలో మరే ఇతర నాయకుడు ఇంత చీప్ పబ్లిసిటీ చర్యలకు దిగారా? అని నేను ఆశ్చర్యపోతున్నాను. ఖాదీ బోర్డ్ క్యాలెండర్ నుండి మహాత్మా గాంధీ ఫొటోను తీసివేసి, ప్రధాని చిత్రాన్ని చేర్చారు. చీప్ పబ్లిసిటీ కోసం, పొలిటికల్ మైలేజీ పొందడం కోసం మన ప్రధానికి ఏ మాత్రం సిగ్గు లేదనేది ఇదంతా స్పష్టం చేస్తుంది' అని ఎద్దేవా చేశారు.

'ఈ ప్రభుత్వం కేవలం ఇద్దరు వ్యక్తులు, వారి కుటుంబాల పట్ల మానవతా బాధ్యతను చూపుతోంది. అది అదానీ, అంబానీ కుటుంబాల పట్ల అని అందరికీ తెలుసు. అదానీ గ్రూప్‌కు, బిజెపి ప్రభుత్వం మధ్య రోజురోజుకూ బంధం బహిర్గతమవుతోంది. ఈ దేశంలోని సామాన్య ప్రజలు తమ పెట్టుబడులు భద్రంగా ఉంటాయని ఆశించి ఎస్‌బిఐ, ఎల్‌ఐసి వంటి సంస్థల్లో కోట్లు పెట్టుబడి పెట్టారు. ఈ ప్రభుత్వం... అదానీ గ్రూపుల షేర్లలో తమ వద్ద ఉన్న ప్రజా సొమ్ముతో జూదం ఆడేందుకు ఎస్‌బిఐ, ఎల్‌ఐసిలను అనుమతించడం ప్రజల ఆశలను వమ్ము చేసింది. అయితే అదానీ గ్రూప్ షేర్లలో రూ.30,000 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టేందుకు ఎల్‌ఐసికి ఎవరు అధికారం ఇచ్చారు? ఎస్‌బిఐ రూ.27 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్లు బయటపడింది. మోడీ అధికారంలోకి రాకముందు అదానీ ఎవరికీ తెలియదు. పవిత్ర బంధంతో ఆయన అందరికీ తెలిసిపోయారు' అని విమర్శించారు.



పెన్షన్ కోతలను వ్యతిరేకిస్తూ పారిస్‌లో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న లక్షలాదిమంది ప్రజలు

ఫ్రాన్స్‌లో లక్షలాది మందికార్మికుల భారీ ప్రదర్శన

పారిస్ : వివాదాస్పదమైన పెన్షన్ సంస్కరణ బిల్లుని వెనక్కి తీసుకోవాలంటూ అధ్యక్షుడు మాక్రాన్‌ను ప్రజలు కోరుతున్నారు. ఈ బిల్లుని వెనక్కి తీసుకోవాలంటూ మంగళవారం సుమారు 2.8 మిలియన్లకు పైగా కార్మికులు ఆందోళన చేపట్టారు. పలు యూనియన్లు, వామపక్ష సంస్థల ఆధ్వర్యంలో రవాణా, విద్య, ఇంధన రంగాలకు చెందిన కార్మికులు ఫ్రాన్స్‌లోని ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు చేపట్టారు. మరో వైపు ఈ బిల్లుపై మంగళవారం జాతీయ అసెంబ్లీలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ బిల్లుని ఉపసంహరించాలంటూ గత నెల నుండి లక్షలాది మంది కార్మికులు ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. తనకు ప్రస్తుతం 60 ఏళ్లని, మరో రెండేళ్లలో పదవీ విరమణ పొందాల్సి వుంది. అయితే నూతన బిల్లు ఆమోదం పొందితే తాను మరో రెండేళ్ల పాటు పదవి విరమణ కోసం వేచి చూడాల్సివుందని, ముఖ్యంగా మహిళలకు ఇది చట్టవిరుద్ధమైనదని పారిస్ వీధుల్లో నిరసన తెలిపిన గ్రాఫిక్ డిజైనర్ అన్నే పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ వెనక్కి తగ్గే వరకు నిరసన చేపడతామని ఫ్రెంచ్ డెమొక్రటిక్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ తెలిపింది. నూతన బిల్లు ఆమోదం పొందితే.. పదవీ విరమణ అనంతరం ఓ కార్మికుడు పూర్తి పెన్షన్ పొందాలంటే 43 ఏళ్ల పాటు యాజమాన్యం నగదు చెల్లింపులు చేయాల్సి వుంటుందని పేర్కొంది.

అదానికి 406 ఎకరాలు


(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపినట్టు చెప్పారు. 1965 మునిసిపాలిటీస్ యాక్ట్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ యాక్ట్ -1955లకు సవరణలకు సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు, రెవెన్యూశాఖల సహకారంతో అర్బన్ లోకల్ బాడీస్‌లో సమగ్ర భూముల రీసర్వేపనుల కోసం అవసరమైన సవరణలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎపి మునిసిపల్ అకౌంట్స్‌సబార్డినేట్ సర్వీసెస్ కింద పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రామాయపట్నం పోర్టు కు 250 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వాలని, గ్రానైట్ పరిశ్రమల కోసం విద్యుత్తు యూనిట్ రూ.2లకు అందించాలని నిర్ణయించింది. తాడేపల్లిలో కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, కొత్త జిల్లాల నేపథ్యంలో అవసరమైన చోట మండల కేంద్రాలు ఏర్పాటు, మచిలీపట్నం పోర్టు 3940.42కోట్లు రుణం తీసుకునేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకు నేందుకు బ్యాంకు గ్యారెంటీకి ఆమోదం తెలిపింది. నెల్లూరు బ్యారేజీకి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి బ్యారేజీగా పేరుమార్చాలని నిర్ణయించారు. వైద్యఆరోగ్యశాఖలో రిక్రూట్‌మెంట్లకు ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు రామాయపట్నం పోర్టులో 2క్యాప్టివ్ బెర్తులను నామినేషన్ పద్ధతిలో కేటాయించేందుకు, టిటిడిలో సేవల నిర్వహణకు 34మంది సిబ్బందితో ఐటి విభాగానికి ఆమోదం తెలిపింది. ఒంగోలు మ ండలాన్ని రూరల్ అర్బన్ మండలాలుగా, విభజించేందుకు అంగీకారం తెలిపింది. ఏలూరు, మచిలీపట్నం, విజయనగరం, నంద్యాల, అనంతపురం, చిత్తూరు మండలాలు అర్బన్, రూరల్ మండలాలుగా విభజనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.నిషేధిత సంస్థలపై నిషేదం గడువును ఏడాది పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇటీవల మృతి చెందిన సినీ ప్రముఖులు కె. విశ్వనాథ్, కృష్ణ, కృష్ణంరాజు, కైకాల సత్యనారాయణ, చలపతిరావు, ఎం. బాలయ్య, వాణి జయరామ్, డైరెక్టర్ సాగర్‌కు నివాళి అర్పిస్తూ మంత్రిమండలి రెండు నిమిషాలు మౌనం పాటించింది.

ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్నాయని అన్నారు. రాజ్యాంగంలోని 243ఆర్(2)(4) ని నేరుగా ఉల్లంఘిస్తూ నామినేటెడ్ సభ్యులను ఓటు వేసేందుకు ప్రొటెమ్ స్పీకర్ అనుమతించారని ఆయన తెలిపారు. ఇదేమీ కేవలం శాసనం కాదని, రాజ్యాంగమే వారిని ఓటు వేయడానికి అనుమతించడం లేదని జస్టిస్ పి.ఎస్.నరసింహా వ్యాఖ్యానించారు. జనవరి 6, 24 తేదీల్లో రెండుసార్లు నిలిచిపోయిన నేపథ్యంలో సకాలంలో మేయర్ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జనవరి 27వ తేదీన ఒబెరాయ్ సుప్రీంను ఆశ్రయించారు. నామినేటెడ్ సభ్యులు ఓటు వేయడానికి అనుమతించిన పక్షంలో మళ్లీ కోర్టుకు వెళ్లేందుకు అనుమతించాలని కూడా ఆమె అప్పుడే కోరారు.



మీకోసం

ఒకేసారి ఎక్కువ గుడ్లు పగిలిపోతే పెంకులన్నీ వేరుచేసి సానలో కారం, ఉప్పు, అల్లం పేస్టు వేసి ఇడ్లీ కుక్కర్‌లో ఉడికించాలి. తర్వాత ముక్కలుగా చేసి ఫ్రై లేదా పులుసు పెట్టుకుంటే బాగుంటుంది.

జీవన సౌరభం

ఒక మేధావి శ్రమ ఫలితం కొన్ని లక్షల మంది సామాన్య ప్రజలకు ప్రయోజనంగా మారుతుంది.

ఎగిరే గువ్వలం



హాయి హాయిగా కమ్మగా
ఆడుతూ పాడుతూ తీయగా
ఆహ్లాదంగా అడుగేస్తాం
ఆనందంగా గడిపేస్తాం

ఎగిరే గువ్వలమై మేము
కొమ్మలపైనా కూర్చుంటాం
పిందె పిందెను గిల్లుతూ
చిగురు రుచిని చవిచూస్తాం

రెక్కలు కట్టుకుని మేము
వాకిలి దాటి వెళ్ళొస్తాం
పిల్ల పక్షులమంతా కూడి
ఎగురుతూ ఆడుకుంటాం

కిచు కిచుమంటూ మేము
కీచులాటలు మొదలెడతాం
కువ కువ గువ్వల్లాగా
పాటలు పాడుతుంటాం


బడికి సెలవు వచ్చిందంటే
రెక్కలిప్పుకుని ఎగిరేస్తాం
స్వేచ్ఛగా ప్రకృతి జతలో
పగలంతా హాయిగా గడిపేస్తాం

ఐకమత్యమే బలమంటూ
కలిసికట్టుగా జీవిస్తాం
తినే తిండిని సమానంగా
ఒకరికి ఒకరం పంచుకుంటాం

పొద్దు వాలితే మేమంతా
వడివడిగా విడిపోతాం
ఎవరికి వారిగా నేరుగా
గూటికి క్షేమంగా చేరుతాం!


- నరెద్దుల రాజారెడ్డి
96660 16636

దారి చూపండి



చిన్నారులూ, కందిరీగ తన స్నేహితురాలు సీతాకోక చిలుకను కలుసుకోవాలి. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- ఆద్య బగాది,
4వ తరగతి,
లిటిల్ ఏంజెల్స్,
ఎం.వి.పి. కాలనీ,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సవాళ్లను ఎదుర్కొని .. రోవర్‌ను నిర్మించి ...

ఎన్నో వింతల, విశేషాల విజ్ఞాన భాండాగారం... అంతరిక్షం. గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలూ ... వాటి ఉనికీ, గమనాలూ .. అంతా ఒక అద్భుత ప్రపంచం. దానిని అర్థం చేసుకొని ముున్ముందుకు సాగటం మనిషికి ఒక సవాలు, జీవన సౌలభ్యానికి ఒక అవసరం. అలాంటి పరిశోధనలకు, ప్రయోగాలకు పెట్టింది పేరు నాసా. ఆ సంస్థ ఇచ్చిన లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేస్తూ .. ప్రపంచ దేశాల యువతరంతో పోటీ పడుతూ ముున్ముందుకు సాగుతోంది ఓ భారతీయ విద్యార్థి బృందం. వారిని పరిచయం చేసుకుందాం.

సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు నాసాకు వెళ్లడం ఒక లక్ష్యంగా పెట్టుకుంటారు. ఏటా ఆ సంస్థ ప్రకటించిన ఛాలెంజిలో ప్రపంచ దేశాలకు ధీటుగా మన దేశ విద్యార్థులు నిలుస్తున్నారు. ఈ సంవత్సరం హ్యూమన్ ఎక్స్‌ప్లోరేషన్ రోవర్ ఛాలెంజ్ పోటీకి యంగ్ టింకర్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వీరు కుటుంబ సవాళ్లను ఎదుర్కొని, కష్టపడి ప్రాజెక్టు పూర్తి చేశారు. ఈ బృందంలో ఇద్దరు విజయవాడకు చెందిన వారు కావడం విశేషం.

హైస్కూలు స్థాయి నుంచి శాస్త్ర సాంకేతిక ప్రాజెక్టుల పట్ల ఆసక్తి గల విద్యార్థులను అన్వేషించి, ప్రోత్సహిస్తోంది యంగ్ టింకర్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్. దీన్ని విద్యావేత్త అనిల్ ప్రధాన్ భువనేశ్వర్‌లో స్థాపించి, నడుపుతున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకుని పెద్ద కంపెనీల్లో స్థిరపడ్డ ఎంతోమంది ఐటిఐ విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ప్రవేశం ఉండాలంటే సాంకేతికంగా కొంత అవగాహన, అనుభవం ఉండాలి. ఇక్కడ విద్యార్థులను బృందాలుగా విభజించి.. డిజైన్, ప్రోటోటైపింగ్, సేఫ్టీ ఆఫీసర్, కమ్యూనికేషన్, టెక్ , మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో విభిన్న అంశాలపై శిక్షణ ఇస్తారు. కొత్త సాంకేతికతతో మిషన్లు రూపొందిస్తూ, ఆకాశంలో, భూగోళంపై ఎటువంటి స్థితిలోనైనా ప్రయాణించే వీలుగా వాహనాలు, మిషన్లు తయారు చేస్తారు.

నాసా (నేషనల్ ఏరోనాటిక్స్, స్పేస్ అడ్మినిస్ట్రేషన్) ఈ సంవత్సరం నిర్వహిస్తున్న 'హెచ్ఈఆర్‌సి' పోటీకి ప్రపంచవ్యాప్తంగా 61 బృందాలు ఎంపికయ్యాయి. ఇందులో మన దేశం నుంచి యంగ్ టింకర్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ బృందం కూడా ఉంది. ఈ బృందంలో 14 – 19 మధ్య వయసు గల ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. వీరు మూడేళ్ల నుంచి 'రోవర్' ప్రాజెక్టుపై పనిచేస్తున్నారు. వీరిని ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు అనిల్, వైశాలి గైడ్ చేస్తున్నారు. ఈ విద్యార్థులు వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాల నుంచి వచ్చిన వారు. పరిశోధన పట్ల ఉన్న ఆసక్తి వారిని ఒక్కటి చేసి, నడుపుతోంది.

భువనేశ్వర్‌కు చెందిన ఆకాంక్ష తండ్రి .. తన చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి అన్నీ తానై పెంచింది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు. దీంతో, ఓ చిల్డ్రన్స్ హోం ఉంటూ చదువుకుంటోంది ఆకాంక్ష. అక్కడ మంచి వసతులు లేకపోయినా చదువును నిర్లక్ష్యం చేయలేదు. ఏదో ఒకటి సాధించి తల్లిని బాగా చూసుకోవాలన్నది తన కోరిక. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించింది. ఫౌండేషన్‌లో శిక్షణకు ఎంపికైంది. ప్రాజెక్టు టీంలో కమ్యూనికేషన్ లీడ్ చేస్తుంది. సంస్థ విద్యార్థులకు అకాడమీ ద్వారా ప్రయోగాత్మక వర్క్‌షాపులూ నిర్వహిస్తోంది.

ఓంపాఠీ పరిస్థితి కూడా ఇలాంటిదే! తన రెండేళ్ల వయసులో తల్లిదండ్రులు విడిపోయారు. తల్లి కష్టపడి చదివిస్తోంది. బాల్యం నుంచి భువనేశ్వర్‌లోని ఓ చిల్డ్రన్స్ హోంలో పెరిగాడు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి సంస్థలో ప్రవేశం పొందాడు. ఎన్నో ప్రయోగాత్మక మిషన్ల తయారీలో అనుభవం సంపాదించాడు.

కటక్ జిల్లాలోని బరల్ గ్రామానికి చెందిన బాసుదేబా భోయ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తండ్రి వ్యవసాయ కూలీ. సెలవు రోజుల్లో బాసుదేబా కూడా తండ్రితో పనులకు వెళతాడు. సైన్సు ప్రయోగాల మీద ఉన్న ఆసక్తితో ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని సంస్థలో చేరాడు. ఇప్పుడు తాను 3డి ప్రింటింగ్ టెక్నాలజీలో నిపుణుడు. ఇప్పటివరకు అతను వికలాంగుల కోసం బయోనిక్ హ్యాండ్స్‌ను తయారు చేసి ఇచ్చాడు. ఇస్రోలో శాస్త్రవేత్తగా మారాలన్న లక్ష్యంగా సైన్సు, విజ్ఞానం దిశగా అడుగులు వేస్తున్నాడు.









ముంబైకి చెందిన సిద్ధాంత్ ఘోష్ ఇంటర్ చదువుతున్నాడు. 11 ఏళ్ల వయసులో తన కంప్యూటర్‌ను తానే తయారుచేసుకున్నాడు. ప్రస్తుతం కేరళలో సొసైటీ ఫర్ స్పేస్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్‌లో రీసెర్చి ఇంటర్న్‌గా పనిచేస్తున్నాడు. అంతరిక్ష నౌక ప్రాథమిక పథ విజువలైజేషన్ కోసం ఉపయోగించే ఓపెన్ సోర్స్ సాధనాన్ని అభివృద్ధి చేశాడు. ఈ ప్రాజెక్టులో రోవర్ డిజైన్ తానే చేశాడు. సభ్యులంతా కూర్చునేలా, సాధనాలు పట్టుకోగలిగే విధంగా తయారు చేశాడు.

విజయవాడకు చెందిన ఆకర్ష్ పదో తరగతి చదుతున్నాడు. తండ్రి విజయ్ మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తల్లి ప్రశాంతి దండమూడి ఓ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆకర్ష్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కూడా. రోవర్‌ను నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడు. యంగ్ టింకర్ టీమ్‌కి టెక్ లీడ్‌గా ఉన్నాడు. రోవర్ మెటీరియల్‌ను కొలతలకు తగ్గట్టుగా కటింగ్, డ్రిల్లింగ్ చేస్తూ మిషన్ తయారీకి కృషి చేశాడు.

విజయవాడకు చెందిన వేమూరి సాయి అక్షర ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతోంది. తల్లిదండ్రులు ఓ విద్యాసంస్థను నిర్వహిస్తున్నారు. అక్షర చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు సొంతం చేసుకుంది. చాలా తక్కువ సమయంలో రూట్ 2 విలువ గల దశాంశ స్థానాలను అత్యధిక సంఖ్యలో చెప్పి అంతర్జాతీయ విద్యార్థిగా గుర్తింపు పొందింది. జాతీయ స్థాయి ఆర్చర్ కూడా. ఆమె రోవర్ సేఫ్టీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. రోవర్ ప్రాజెక్టులో సీటింగ్ సిస్టమ్, సేఫ్టీ బెల్ట్ సిస్టమ్, తగిన బ్రేకింగ్ సిస్టమ్‌ను పర్యవేక్షిస్తోంది.

ఈ ఆరుగురూ భిన్న భాషా, ప్రాంతీయ వైవిధ్యం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా నిత్యం కలుసుకుంటారు. ప్రాజెక్టు విషయాలపై చర్చిస్తారు. వీరు నిర్మిస్తున్న రోవర్ వాహనం నమూనా అంగారక గ్రహంపై, చంద్రుని ఉపరితలంపై ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉందని చెబుతున్నారు. నాసా యొక్క ఆర్టెమిస్ మిషన్‌తో ధీటుగా ఉండేలా దీన్ని రూపొందించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగే పోటీల్లో దీనిని ప్రదర్శిస్తారు. గత ఏడాది నాసా నిర్వహించిన పోటీల్లో మూడో ర్యాంకు సాధించిన ఈ సంస్థ విద్యార్థులు ఇప్పుడు మొదటి స్థానంలో నిలిచేలా లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు.

కోర్టు పరిధిలో ఉంది

- **రాజధాని వివాదంపై కేంద్ర ప్రభుత్వం**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉందని, దానిపై ఏమి మాట్లాడినా కోర్టు పరిధిలోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు వైసిపి ఎంపి వి. విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ బుధవారం రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. మూడు రాజధానులకు సంబంధించి చట్టం చేసే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తమతో ఎటువంటి సంప్రదింపులు చేయలేదని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 5, 6కు అనుగుణంగా నూతన రాజధాని ఏర్పాటుకు ఉన్న



ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక నిపుణల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదికను తదుపరి చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది' అని మంత్రి పేర్కొన్నారు. 'ఈ మేరకు అమరావతిని రాష్ట్ర రాజధాని నగరంగా ప్రకటిస్తూ 2015 ఏప్రిల్ 23న రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. తదనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎపిసిఆర్‌డిఎ చట్టం-2020ని రద్దు చేసింది. శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు నగరాలను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ, సమ్మిళిత అభివృద్ధి చట్టం (ఎపిడిఐడిఎఆర్)-2020ను తీసుకువచ్చింది' అని మంత్రి వివరించారు. ఈ చట్టం చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని అన్నారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం 2021లో ఈ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ అప్పీల్ (సివిల్)ను దాఖలు చేసిందని, ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆటోనగర్‌లోని పౌరసరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. గోధుమ పిండి పంపిణీ పైలెట్ ప్రాజెక్టుగా ఉత్తరాంధ్రలో ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్, ఎమ్‌డి వీరపాండియన్, డైరెక్టర్ ఎం విజయసునీత పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ పట్ల హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలోని కాంట్రాక్టు డ్రైవర్లు, కండక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం టైమ్‌స్కేల్‌ను ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వైవి రావు, పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 13 మంది కండక్టర్లకు, 22 మంది డ్రైవర్లకు టైమ్‌స్కేల్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటనలో ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యారోగ్యశాఖలోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజి ఇవ్వాలి

- **ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్‌నర్స్ యూనియన్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్యశాఖలో చేపట్టిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో ఇప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజి ఇవ్వాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్‌నర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్‌నర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు జి దయామణి, ప్రధాన కార్యదర్శి జి భవాని, కోశాధికారి డి వేణుగోపాలచారి బుధవారం వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎంటి కృష్ణబాబు, హెల్త్ డైరెక్టరు రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దాదాపు 15 ఏళ్లుగా తక్కువ వేతనాలకు పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. వయోపరిమితిలో కూడా సడలింపులు ఇవ్వాలన్నారు.

గిరిజనులపై కక్ష కట్టిన ఆర్‌ఎస్‌ఎస్

గువహటి : ఎక్కడ ఎన్నికలు జరిగితే అక్కడ మత, కుల, ప్రాంతాల మధ్య చిచ్చు రాజేసేందుకు తహతహలాడే బిజెపి ఇప్పుడు అడవి బిడ్డల మధ్య కూడా చిచ్చు రాజేసిందుకు ప్రయత్నిస్తోంది. ఏ మతానికీ చెందని అడవి బిడ్డలను మతం మారినవారు, మారని వారూ అంటూ విభేదాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. త్వరలో ఎన్నికలు జరగనున్న మేఘాలయ- నాగాలాండ్‌లలో క్రిస్టియన్‌లుగా మారిన గిరిజనులను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలలని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన జనజాతి ధర్మ-సంస్కృతి సురక్షా మంచ్ (జెడిఎస్‌ఎస్‌ఎం) ఆందోళనలకు పిలుపునిచ్చింది. క్రైస్తవ, ఇస్లాం వంటి విదేశీ మతాలను స్వీకరించిన ప్రజలు రెట్టింపు ప్రయోజనాలను పొందుతున్నారని జెడిఎస్‌ఎస్‌ఎం కోకన్వీనర్ బినుద్ కుంబంగ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై 1968లో సంయుక్త పార్లమెంటరీ కమిటీని కూడా నియమించింది. కాగా, మేఘాలయ, నాగాలాండ్‌లలో ఈ నెల 27న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

నిజం విత్ స్మితాతో చిరు

హైదరాబాద్: ఓటీటీలకు ఈ మధ్య ఆదరణ బాగా పెరిగిపోయింది. సినిమాలనే కాదు వెబ్ సిరీస్‌లు, టాక్ షోలు ఇలా ఎన్నో వినోద కార్యక్రమాలకు వేదికైంది. ఈ నేపథ్యంలో గాయని స్మిత హోస్ట్‌గా 'నిజం విత్ స్మిత' అనే టాక్‌షోను నిర్వహిస్తుంది. ఈ టాక్ షోకు సోనిలివ్ వేదికైంది. కాగా ఫిబ్రవరి 10న ఈ షో ప్రారంభం కానుంది. మొదటి ఎపిసోడ్‌లో చిరు గెస్ట్‌గా వచ్చారు. తాజాగా చిరు ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో రిలీజైంది. ఈ ప్రోమో నెట్టింట వైరల్ అవుతుంది. దీనికి సంబంధించిన ఫుల్ ఎపిసోడ్ ఫిబ్రవరి 10న స్ట్రీమింగ్ కానుంది.

ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా..

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నేటినుంచే..
ఉదయం 9.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



నాగ్‌పూర్: ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) ఫైనల్స్ బెర్త్ లక్ష్యంగా భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య టెస్ట్ సిరీస్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇరుజట్ల మధ్య జరిగే నాలుగు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగే తొలి టెస్ట్‌కు నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగే తొలి టెస్ట్‌కు టీమిండియా జట్టు కూర్పు ప్రధాన సమస్యగా తయారైంది. టెస్ట్ సిరీస్‌కు ప్రధాన కీపర్‌గా ఎంపికైన వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఇటీవల కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో అతడు ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో కీపింగ్ బాధ్యతలు ఆంధ్రప్రదేశ్ ఆటగాడు శ్రీకర్ భరత్ భుజస్తంధాలపై పడింది. కీపింగ్ బాధ్యతలు ఓపెనర్ కేఎల్ రాహుల్‌కు అప్పగించాలని భావిస్తే.. అతనిపై అదనపు భారం పడినట్లే.

ఓపెనర్లకు పోటీ..

టీమిండియా ఓపెనర్లగా ముగ్గురు రేసులో ఉండడం జట్టు యాజమాన్యానికి ప్రధాన తలనొప్పిగా తయారైంది. కేఎల్ రాహుల్, రోహిత్ శర్మతో పాటు ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ మధ్య తీవ్ర పోటీల నెలకొంది. ఒకవేళ కేఎల్ రాహుల్‌కు వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించాల్సి వస్తే మాత్రం అతడు మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగే అవకాశముంది. ఇక టి20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్ టెస్టుల్లో అరంగేట్రం చేయడం ఖాయంగా కనబడుతోంది. అతడు న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో సహజసిద్ధ బ్యాటింగ్ స్టైల్‌కు భిన్నంగా ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్న క్రమంలో భారీషాట్లకు వెళ్లకుండా క్రీజ్‌లో నిలబడి మ్యాచ్‌ను గెలిపించిన సందర్భాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి ఉంది.

స్పిన్నర్ల ఎంపికపైనా దృష్టి..

కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ ప్రధాన స్పిన్నర్లు కాగా.. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ కోటాలో ఒకరికి బెర్త్ దక్కడం ఖాయం. మూడో స్పిన్నర్ అవసరమని భావిస్తే మాత్రం అక్షర్ పటేల్‌కు చోటు దక్కినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నాగ్‌పూర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశముండగా.. ఒక్క పేసర్‌తోనే తుదిజట్టును ప్రకటించే అవకాశముంది. గాయంతో శ్రేయస్ అయ్యర్ జట్టుకు దూరం అవ్వడంతో ఆ ప్లేస్‌ను ఫిల్ చేసే తలనొప్పి టీమ్ మేనేజ్‌మెంట్‌కు వచ్చింది.

100టెస్టుల క్లబ్‌లో పుజారా..

టీమిండియా టెస్ట్ బ్యాటర్ ఛతేశ్వర పుజారా అరుదైన రికార్డుకు చేరువలో నిలిచాడు. ఇప్పటివరకు 98టెస్టులు ఆడిన పుజారా మరో రెండు టెస్టులు ఆడితే 100టెస్టుల క్లబ్‌లో చేరనున్నాడు. భారత్ తరపున ఇప్పటివరకు సచిన్, ద్రవిడ్, వివిఎస్ లక్ష్మణ్, అనిల్ కుంబ్లే, కపిల్ దేవ్, గవాస్కర్, వెంగ్‌సర్కార్, గంగూలీ, ఇషాంత్ శర్మ, విరాట్ కోహ్లి, హర్భజన్ సింగ్, సెహ్వాగ్‌లు 100కు పైగా టెస్టులు ఆడి ఉన్నారు. ఇప్పుడు పుజారా వారి సరసన చేరనున్నాడు.

అంచనా..

ఇండియా : రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్/సూర్యకుమార్, కేఎల్ రాహుల్, పుజారా, కోహ్లి, జడేజా, కేఎస్ భరత్(వికెట్ కీపర్), అశ్విన్, అక్షర్ పటేల్/కుల్దీప్, షమీ, సిరాజ్.

ఆస్ట్రేలియా : పాట్ కమిన్స్(కెప్టెన్), డేవిడ్ వార్నర్, ఖవాజా, లబూషేన్, స్టీవ్ స్మిత్, ట్రివిస్ హెడ్(వికెట్ కీపర్), హ్యాండ్‌కోంబ్/రెన్‌షా, క్యారీ, అగర్, బొలెండ్, లియాన్.

మెరిసిన రీచా

రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై గెలుపు

ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ రేపటినుంచే..

జొహాన్స్‌బర్గ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు జరుగుతున్న బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత బ్యాటర్స్ రాణించారు. రీచా ఘోష్(91 నాటౌట్)కి తోడు రోడ్రిగ్స్(41) రాణించడంతో భారత్ నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 183పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ మహిళలజట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 131పరుగులే చేయగల్గింది. ఓపెనర్ ఖాతూన్(32), సుల్తానా (40) బ్యాటింగ్‌లో రాణించారు. దేవిక వైద్యకు రెండు, రాజేశ్వరి, అంజలి, దీప్తి, రాధా, షెఫాలీకి ఒక్కో వికెట్ దక్కాయి. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో 130పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బ్యాటర్స్ నిరాశపరచడంతో భారత మహిళలజట్టు 85పరుగులకే ఆలౌటైంది.

భారత మహిళల జట్టు షెడ్యూల్..

12(ఆది) : భారత్ × పాకిస్తాన్ (న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్)
15(బుధ) : భారత్ × వెస్టిండీస్ (న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్)
18(శని) : భారత్ × ఇంగ్లండ్ (సెయింట్ జార్జెస్, ఓవల్)
20(సోమ) : భారత్ × ఐర్లాండ్ (సెయింట్ జార్జెస్, ఓవల్)

సాయంత్రం 6.30గం॥ల నుంచి సార్‌స్పోర్ట్స్‌లో

సుదీప్, మజుందార్ శతకాలు

రంజీట్రోఫీ సెమీఫైనల్స్

ఇండోర్ వేదికగా జరుగుతున్న రంజీట్రోఫీ సెమీఫైనల్లో బెంగాల్ జట్టు బ్యాటర్స్ రాణించారు. సుదీప్ కుమార్ ఘరామీ(112), అనుస్తుప్ మజుందార్(120) శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి బెంగాల్ జట్టు 4 వికెట్ల నష్టానికి 307పరుగులు చేసింది. వీరు 3వ వికెట్‌కు (242పరుగులు) డబుల్ సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

కర్ణాటక 229/5

బెంగళూరు వేదికగా సౌరాష్ట్రతో జరుగుతున్న రెండో సెమీస్‌లో కర్ణాటక జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ మయాంక్ అగర్వాల్(110) అజేయ సెంచరీకి తోడు వికెట్ కీపర్ శ్రీనివాస్ శరత్(58) అర్ధసెంచరీతో రాణించాడు. కుశాంగ్ పటేల్‌కు రెండు, చేతన్ సకారియా, మన్కడ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. విజయవాడలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో రెండు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. మొత్తం 30టీమ్‌లు నమోదు చేసుకోగా, మొదటి రోజు 16 టీమ్‌లు తలపడ్డాయి. రెండవ రోజు 14 టీమ్‌లు పోటీపడనున్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ. 15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ. ఐదు వేలు క్యాష్ ప్రైజ్‌తో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేయనున్నారు. ఈ పోటీలను స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొమ్మసాని రవి, విజయవాడ యూత్ ఫెస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి విజయ్‌ప్రకాష్, అమరావతి బాలోత్సవ్ కోశాధికారి పి మురళీకృష్ణ, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68